J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 48 1.5.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## అధికారంలో ఉన్నప్పుడు ఆచరించి ఉంటే..

# 'మావిగన్' మంచి ఆలోచనే

- జగన్ కొత్త రాజధాని ప్రతిపాదనపై సర్వత్రా చర్చ
- ప్లాన్‌బీ అంటూ మావిగన్ ప్రకటన
- ప్రభుత్వాధినేతగా ఉన్నప్పుడు ఎందుకు ముందడుగేయలేదు?
- గతంలోనే చెప్పి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదంటున్న విశ్లేషకులు

నవ్యాంధ్ర రాజధాని ఏది..? గత పుష్కరకాలంగా ఇది సమాధానం లేని ప్రశ్నగా మారింది. తొలుత చంద్రబాబు అమరావతికి పురుడు పోయడం, తర్వాత జగన్ మూడు రాజధానులకి తెరలేపడం క్యాపిటల్ లెస్ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్ ఒడిదొడుకుల ప్రయాణానికి వేదికైంది. దీంతో రాష్ట్ర రాజకీయ రంగస్థలంపై ఎవరు చక్రం తిప్పితే వారికి అనుగుణంగా రాజధాని విషయంలో సర్దుకుపోయే అగత్యం ఆంధ్రులకు దాపురించిందన్న మాట నెట్టింట చక్కర్లు కొట్టింది. అలాంటి సమయంలో రెండోసారి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం, పార్లమెంట్ సాక్షిగా రాష్ట్రవిభజన చట్టంలో మార్పులు చేసి శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. అయితే అందరూ హమ్మయ్యా, ఇక రాజధాని విషయంలో గందరగోళం ఉండదులే, అనుకుంటున్న సమయంలో జగన్ మావిగన్ ప్రతిపాదనతో ముందుకు రావడం సంచలనంగా మారింది. ప్లాన్ బీ పేరిట జగన్ ప్రతిపాదించిన ఈ కొత్త రాజధాని అస్త్రం రాష్ట్ర రాజకీయ యుద్ధరంగంలో కీలక మలుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇదీ మేధావుల మాట

తొలుత జగన్ ప్రతిపాదించిన రాజధాని మావిగన్ పేరుకు సంబంధించిన ఉచ్ఛారణ, శబ్ద ప్రయోగం విషయంలో నెట్టింట జోకులు, విమర్శలు వెల్లువెత్తినా క్రమంగా పేరే బాగా లేదు తప్ప మావిగన్ ప్రతిపాదన మంచిగానే ఉందే అనే అభిప్రాయాలు ఊపందుకున్నాయి. అయితే మావిగన్ మంచిదే అయినా అది ప్రతిపాదించిన సమయం ప్రజల ముందుకు తెచ్చిన విధానం మాత్రం ఆమోదయోగ్యంగా లేదని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

2లో

## ఈసారి మన నెల్లూరు వేదికగా టీడీపీ మహానాడు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీ ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు మహోత్సవానికి ఈసారి నెల్లూరు వేదిక కానుంది. గురువారం ఉదయం పార్టీ జాతీయ అధక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు 1983లో పార్టీని స్థాపించిన తర్వాత, నాయకులతో, కార్యకర్తలతో ప్రత్యక్షంగా మమేకం అవ్వడానికి, పార్టీ విధానాలను చర్చించడానికి

2లో



# 'మావిగన్' మంచి ఆలోచనే

(మొదటిపేజీ తరువాయి)

## అసలు మావిగన్ గొడవేంటి..?

ప్రస్తుతం మావిగన్ చుట్టూ రాష్ట్ర రాజకీయాలు పరిభ్రమిస్తున్న నేపథ్యంలో అసలు మావిగన్ అంటే ఏమిటి.? అందులో ఏముంది..? రాష్ట్ర భవిష్యత్‌కు అది నిజంగానే గ్రోత్ ఇంజిన్ అవుతుందా..? లేక కేవలం రాజకీయ ప్రేరేపిత ప్రకటనా..? అనే అంశాలపై పెద్దఎత్తునే చర్చ జరుగుతోంది. ఈనేపథ్యంలో జగన్ కొత్త ప్రతిపాదనలో దాగున్న చిదంబర రహస్యం ఏమై ఉంటుందనే ఆసక్తి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలున్న ప్రతిచోటా నెలకొందనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు మావిగన్‌లో ఏముంది? అనే కుతూహలంతో చాలామంది నెట్టింట వెతుకులాట కూడా మొదలుపెట్టారు.

ఇక మావిగన్‌లోతుల్లోకెళ్లి పరిశీలిస్తే, ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాలో పరిధిలో ఉండే మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల పరిధినంతటినీ ఒక జోన్‌గా నిర్ణయించి ఆ సమీకృత ప్రాంతాన్నంతా రాజధానిగా నిర్ణయిస్తే బాగుంటుందని ఇది ఆంధ్రప్రదేశ్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందని జగన్ ప్రతిపాదించారు. ఇందులో భాగంగా మచిలీపట్నంలో "మా" విజయవాడలో "వి", గుంటూరులో "గన్" అనే పదాలను స్వీకరించి మావిగన్‌గా చేయాలన్నది జగన్ ప్రతిపాదన. అలాచేస్తే ఆంధ్రులకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైను తలదన్నే రాజధానిని తక్కువ ఖర్చుతో నిర్మించుకోవచ్చని ఆయన ప్రకటించారు. దీంతో జగన్ ప్రతిపాదించిన మావిగన్ తరహాలో వివిధ ప్రాంతాల పేర్లతో పలు కొత్తకొత్త శబ్దాలను సృష్టించి టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున జోక్‌లు, రీల్స్‌ను నెట్టింట నింపారు. ఇక వారి అధినేత చంద్రబాబు కూడా అసలు జగన్‌కు విజన్ లేదని ఎప్పుడు ఏది మాట్లాడతాడో..? ఏం చేస్తాడో ఆయనకే స్పష్టత లేదని విమర్శించారు. పలువురు విశ్లేషకులు సైతం కేవలం అమరావతి అనే పదాన్ని ఉచ్ఛరించడానికి కూడా జగన్‌కు ఇష్టం లేకపోవడం వల్లే మావిగన్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. అయితే కాలక్రమేణా మావిగన్ మంచి ఆలోచనే అని, అయితే నిలకడ లేని రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగన్‌కు ఏ సమయంలో ఏ ప్రతిపాదన ముందుకు తీసుకురావాలో అవగాహన లేకుండా పోయిందని విమర్శిస్తున్నారు. అందుకే మావిగన్ ప్లాన్ మహత్తరంగా ఉన్నా క్యాష్ చేసుకోలేకపోతున్నారని అభిప్రాయపడుతున్నారు.

## అసలు మావిగన్‌లో ఏముంది..?

జగన్ ప్రతిపాదించిన కొత్త రాజధాని మావిగన్‌లోతౌలుత ఆంధ్రప్రదేశ్ రాజధాని కారిడార్ ఏర్పాటు కోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పరిధిలోకి వచ్చే మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ ప్రాంతాలను ఒకే గొడుకు కిందికి తీసుకురావాల్సి ఉంటుందని సూచించారు. మచిలీపట్నం - విజయవాడ మధ్య దూరం 70 కిలోమీటర్లు, విజయవాడ - గుంటూరు మధ్య 40 కిలోమీటర్లు సహా మొత్తం 110 కిలోమీటర్ల దూరం ఉన్న నేషనల్ హైవే ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేస్తే ఇప్పటికే అభివృద్ధి చెందిన మూడు నగరాలు ఒకే మహానగరంగా రూపాంతరం చెందే అవకాశం ఉంటుందన్నది జగన్ ఆలోచన. తద్వారా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సమదూరంలో ఉండే ప్రాంతం రాజధాని అవుతుందని, ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిపాదిత మావిగన్ ప్రాంత పరిధిలో ఇప్పటికే 40లక్షల మందికిపైగా జనాభా ఉందని వాటిని పక్కాగా ఉపయోగించుకుంటే పట్టణీకరణ, నగరీకరణ మరింతగా జరిగి జనాభా కేవలం దశాబ్దకాలంలోనే కోటికి చేరువవుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే మానవ వనరులు పుష్కలంగా లభించి రాష్ట్ర సమతౌల్య అభివృద్ధి సాధ్యమవుతుందని లెక్కలుకడుతున్నారు. కొత్త రాజధాని మావిగన్ పరిధిలో మచిలీపట్నం పోర్టు, రెండు అతిపెద్ద రైల్వేస్టేషన్లు కలిగిన విజయవాడ, గుంటూరులతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం గన్నవరం వంటివి అందుబాటులో ఉంటాయని తద్వారా ఇతర ప్రాంతాలతో సులభంగా కనెక్టివిటీ పెరిగి మావిగన్ ఇతర రాష్ట్రాల రాజధానులతో పోటీపడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాగే మావిగన్ పరిధిలోకి మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తాడేపల్లి వంటి నాలుగు కార్పొరేషన్లు, ఉయ్యూరు, తాడిగడప వంటి మున్సిపాలిటీలు వస్తాయని తద్వారా వాణిజ్య కార్యకలాపాలకు రాజధాని కేంద్రబిందువుగా మారే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధి కూడా ఇంచుమించు మావిగన్ పరిధికి అటూఇటూ ఉంటుందని, జన సాంద్రత, మౌలిక సదుపాయాలైన డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఇప్పటికే మావిగన్‌కు ఉన్నాయని, కేవలం ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ సంస్థల ఏర్పాటుకు స్థలాలు కేటాయించడంతో పాటూ కొద్దిపాటి ఆర్థిక ప్రోత్సాహం ఇస్తే మావిగన్ ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌గా మారడం ఖాయమని చెబుతున్నారు. ఇది అమరావతి కంటే ఎన్నోరెట్లు బెటర్ అని సూచిస్తున్నారు.

## మూడుముక్కలాట ఆడకుండా ఉండి ఉంటే!

ఇప్పటికే అభివృద్ధి చెందిన మూడు ప్రాంతాలను కలిపి మహానగరం తీర్చిదిద్దాలని ప్రతిపాదించడం ద్వారా రాజధాని విషయంలో జగన్ ఆలోచన కచ్చితంగా తటస్థుల్లో కొంత హైప్‌ను తీసుకొచ్చిందనడంలో సందేహం లేదు. అయితే ఆయన కొత్త రాజధాని ప్రకటన చేసిన సమయం, విధానం మాత్రం విమర్శల పాలవుతోంది. ఎందుకంటే అమరావతికి గతంలో అసెంబ్లీ సాక్షిగా జగన్ తొలుత ఆమోదం తెలపడం. తర్వాత అధికారంలోకి రాగానే అమరావతిలో శాసనరాజధాని, విశాఖలో కార్యనిర్వాహక రాజధాని, కర్నూల్‌లో న్యాయరాజధాని అంటూ మూడుముక్కలాట ఆడడం, ఇప్పుడు మావిగన్‌ను తెరపైకి తీసుకురావడం జగన్ చంచల మనస్థత్వానికి, నిలకడ లేని నిర్ణయాలకు నిదర్శమని మేధావులు విమర్శిస్తున్నారు. మావిగన్ వంటి మహత్తరమైన ప్లాన్ "బీ" ని తనవద్ద పెట్టుకుని, అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడడం ఆయన అవివేకానికి, రాజకీయ శూన్యతకు అచ్చమైన ఉదాహరణ అని దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడే మావిగన్ ప్రతిపాదన చేసి అమరావతికి, మావిగన్‌కు మధ్య స్పష్టమైన తేడాలను, ఆర్థిక అవసరాలను, రాష్ట్ర స్థితిగతులను ప్రజలకు జగన్ పూర్తిస్థాయిలో వివరించి ఉంటే 151 నుంచి 11 సీట్లకు దిగజారే పరిస్థితి ఉండేదని కాదని తేల్చిచెబుతున్నారు. ఏదేమైనా కత్తిమీద సాముగా మారిన నేటి రాజకీయాల్లో ప్రతి అడుగూ ఆచితూచి వేయడం ఎంతో ముఖ్యం. కోటరిని నమ్ముకునో, అతి విశ్వాసంతోనో అధికార అహంకారంతోనో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటే ఆ తప్పటడుగులకు భారీ మూల్యం చెల్లించక తప్పదనడంలో సందేహం లేదు. ఈ విషయం ఇప్పటికే గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో జగన్‌కు అర్థమై ఉంటుందనడంలో అనుమానం కూడా లేదు. మరి అలాంటి పరిస్థితుల్లో ఆయన మావిగన్‌ను భవిష్యత్‌లో ఎలా ప్రజల ముందుకు తీసుకెళ్తారో, ప్రజలను ఎలా ఒప్పిస్తారో అన్నది ఆసక్తికరమే.

కానీ ఒక్కటి మాత్రం నిజం విభజనతో దగాపడిన రాష్ట్రానికి సుస్థిరమైన ప్రభుత్వం, దీర్ఘకాలిక ప్రయోజనాలతో కూడిన రాజధాని ప్రాంతం ఎంతైనా అవసరం. దాన్ని దృష్టిలో ఉంచుకుని జగన్ ఇప్పటికైనా స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాలి. మాటల్లో స్పష్టత చేతల్లో నిజాయితీని నిరూపించుకుంటూ ముందుకు సాగాలి. అప్పుడే ఆయనపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లకుండా ఉంటుంది. అలాకాకుండా మూడు రాజధానుల తరహాలోనే మావిగన్ రాజకీయ ప్రేరేపిత ప్రకటనగానో, అమరావతిపై ద్వేషంలో నుంచి పుట్టుకొచ్చిన ప్రతిపాదనగానో మిగిలిపోతే రాబోవు రోజుల్లో ప్రజల్లో మరింతగా పలచన కావడం ఖాయం. ఏదేమైనా జగన్ ఇప్పటికైనా ముడుముక్కలాట వంటి మూర్ఖత్వపు నిర్ణయాలకు స్వస్థిపలికి, రాష్ట్రంలోని మూడు పెద్దనగరాలను సమీకృతం చేసి మహానగరంగా మావిగన్‌ను ముందుకుతీసుకు రావడం మాత్రం కచ్చితంగా వైసీపీ భవిష్యత్‌కు కొత్త దశా-దిశను నిర్ణయించే అవకాశాలు లేకపోలేదని విశ్లేషకులు, మేధావులు అభిప్రాయపడుతుండడం గమనార్హం...!

# వేదగిరి నరసింహస్వామికి..

# 1న బంగారు గరుడసేవ

నెల్లూరు రూరల్‌లోని నరసింహకొండలో కొలువైవున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మే 1వతేదీ సాయంత్రం మోహినీ ఉత్సవం, రాత్రికి అఖండజ్యోతి, బంగారు గరుడసేవ ఉత్సవాలు కన్నులపండువగా జరుగనున్నాయి. 2వ తేదీ రాత్రి కల్యాణోత్సవం, గజవాహనసేవలు, 3న ఉదయం 8 గంటలకి రథోత్సవం, 4వ తేది రాత్రి అశ్వవాహనసేవ, 5వతేదీ రాత్రి 7గంటలకి ధ్వజావరోహణం జరుగుతాయి. 6వ తేదీ సాయంత్రం పుష్పయాగం ఉంటుంది. రాత్రి 9గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తారు. ఆలయ ఛైర్మన్ అచ్యుత్ శంకర్‌రెడ్డి, ఇఓ గోపీ తదితరులు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తూ, భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# టీడీపీ మహానాడు

(మొదటిపేజీ తరువాయి)

తన పుట్టిన రోజైన మే 28న దీన్ని ప్రారంభించారు. ఇది కేవలం రాజకీయ సభ కాదు, తెలుగు తమ్ముళ్లకి అదొక పండుగ. నిజానికి 1982లో టీడీపీ పుట్టిన కొన్ని నెలలకే 1983లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. పార్టీకి ఒక స్పష్టమైన సిద్ధాంతం, క్రమశిక్షణ, కార్యకర్తల భాగస్వామ్యం ఉండాలని ఎన్టీఆర్ భావించారు. దానికోసమే "మహానాడు" అనే వేదికను ఏర్పాటు చేశారు. 1995 జనవరి 18న ఎన్టీఆర్ దివంగతులయ్యారు. అప్పటినుండి కూడా అదే మే 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడును నిర్వహించడం ఆ పార్టీ ఆనవాయితీగా పెట్టుకుంది.

మహానాడు సాధారణంగా 2లేదా 3 రోజులు జరుగుతుంది. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు, పార్టీ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆ ఏడాది రాష్ట్రంలో నెలకొన్న సమస్యలు, కేంద్ర విధానాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై తీర్మానాలు చేస్తారు. ఇవే తర్వాత పార్టీ మేనిఫెస్టోకు ఆధారం అవుతాయి. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, యువత, మహిళలు, బీసీ-ఎస్సీ-ఎస్టీ-మైనారిటీ వర్గాల సమస్యలపై ప్రత్యేక సెషన్లు ఉంటాయి. తెలుగు సంస్కృతి, ఎన్టీఆర్ సినీ-రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసే ప్రదర్శనలు ఉంటాయి. చివరిరోజు లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ జరుగుతుంది. ఆ సభలో పార్టీ అధినేత కీలక ప్రసంగం చేస్తారు. ఓ వైపు భవిష్యత్ హామీలు, మరో వైపు ప్రత్యర్థులపై విమర్శల తూటాలకి ఆనాటి సభ వేదిక అవుతుంది.

## మహానాడు ప్రాముఖ్యత..!

తెలుగుదేశం పార్టీకి దేశంలోనే బలమైన క్యాడర్ ఉన్న పార్టీగా గుర్తింపు తెచ్చింది ఈ మహానాడు సభలో. గ్రామస్థాయి కార్యకర్త కూడా నేరుగా అధినేతకు తన అభిప్రాయం చెప్పే అవకాశం ఇక్కడ లభిస్తుంది.

1996 మహానాడులో చంద్రబాబు నాయుడు "విజన్ 2020" ప్రకటించారు. 2014లో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం ఇక్కడే పురుడు పోసుకుంది. ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు, ఇప్పుడు నారా లోకేష్ వరకు నాయకత్వ మార్పు జరిగినా, టీడీపీ ఒకే తాటిపై నడుస్తోందనడానికి ఈ మహానాడే అతిపెద్ద ఉదాహరణ. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మహానాడు కడప గడపలో జరిగింది. ఆ సభలో "కార్యకర్తే అధినేత" అని చంద్రబాబు ప్రకటించడం విశేషం. అంతే కాకుండా విజన్ 2047 పై కూడా ఇక్కడ చర్చ జరిగింది. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా 42 ఏళ్లుగా ఆగకుండా జరుగుతున్న వార్షిక సభ ఈ మహానాడు. పసుపు జెండా రెపరెపలు, ఎన్టీఆర్ ఫొటోలు, "జై తెలుగుదేశం" నినాదాలతో మహానాడు ప్రాంగణం పార్టీ శ్రేణులలో కొత్త జోష్ నింపుతుంది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా మహానాడు మాత్రం ఇప్పుడివరకు ఆగలేదు.

## ఈ ఏడాది మహానాడుకి వేదికగా నెల్లూరు!

ప్రస్తుతానికి అధికారిక సమాచారం ప్రకారం 2026 మహానాడు నెల్లూరు జిల్లాలో జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు జిల్లా పార్టీ నేతలకి కూడా సమాచారం ఇచ్చారని తెలిసింది. నిజానికి ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం లేదా విజయనగరంలలో ఈ యేడాది మహానాడు చేయాలని ముందుగా తలపెట్టారు. అయితే, జూన్ లేదా జులై మాసంలో ఉత్తరాంధ్రలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన, బహిరంగ సభ ఖరారు కావడంతో మహానాడు వేదికను నెల్లూరుజిల్లాకి మార్చారు. గత ఏడాది కడపలో జరిగిన మహానాడులో కొంతమంది నెల్లూరు నేతలకి కీలక బాధ్యతలు అప్పజెప్పారు. శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్రకి కోఆర్డినేషన్ కమిటీ, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తీర్మానాల కమిటీ, మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మీడియా కమిటీ, మంత్రి పి.నారాయణకి రిసోర్సెస్ & ట్రాన్స్‌పోర్టేషన్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి ఫుడ్ కమిటీల బాధ్యత అప్పజెప్పారు. ఈసారి మహానాడు మన జిల్లాలోనే జరగనున్న తరుణంలో ఎవరెవరికి ఏ ఏ బాధ్యతలు అప్పజెప్తారో చూడాలి. మహానాడు నెల్లూరుజిల్లాలో జరపాలని మాత్రమే నిర్ణయించారు తప్ప ఇంకా స్థలం ఎక్కడన్నది ప్రకటించలేదు. ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, బీద మస్తాన్‌రావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వంటి సీనియర్ నాయకులు, ఆర్థిక దిగ్గజాలు వున్న నెల్లూరులో ఎవరెవరికి ఎలాంటి బాధ్యతలు అప్పజెప్తారోనన్న ఆసక్తి పార్టీ వర్గాలలో కనిపిస్తుంది. మొత్తం మీద మాత్రం పార్టీ ఆవిర్భావం తరువాత తొలిసారిగా నెల్లూరులో జరగనున్న 2026 - మహానాడుని జిల్లా నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారనడంలో సందేహం లేదు..!

## నగరంలోని హోటళ్ళు, ప్రధాన కూడళ్ళలోని హోర్డింగ్‌లు ఫుల్...

2026 మహానాడు నెల్లూరుజిల్లాలో జరుగనుందని ఖరారు కావడం, ఆమేరకు నేతలకు సమాచారం అందడంతో జిల్లాలో అప్పుడే సందడి మొదలైంది. నగరంలో ఉన్న అన్ని హోటళ్ళలోని రూములు దాదాపు 90శాతానికి పైగా కోటంరెడ్డి సోదరులు బుక్ చేసుకున్నారు. అలాగే, నెల్లూరు నగరం, నగర శివార్లలోని ప్రధాన కూడళ్ళలో ఉన్న అన్ని హోర్డింగులని కోటంరెడ్డి సోదరులే రిజర్వ్ చేసుకున్నారు. నగరంలోని పలు గెస్ట్‌హౌస్‌లని, వివిధ పాఠశాలలకి చెందిన స్కూల్ బస్సులని, నగరంలో నడుస్తున్న సిటీ బస్సులని ముందుగానే రిజర్వ్ చేసినట్లుగా సమాచారం. నెల్లూరు రూరల్ లేదా కోవూరు నియోజకవర్గంలో మహానాడు జరుగవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంతటి భారీ స్థాయిలో కార్యక్రమం జరపాలంటే.. నగరం, రూరల్ లేదా కోవూరులలో తప్పితే ఇంకెక్కడా అవకాశం లేదు. మొత్తం మీద జిల్లాలో నెల ముందే మహానాడు హడావిడి మొదలైంది. పార్టీ ఏర్పడ్డ నాలుగు దశాబ్దాల కాలంలో మొట్టమొదటిసారిగా నెల్లూరులో మహానాడు జరగడం, 2024లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మహానాడులలో ఇది రెండవది కావడం విశేషం. అటు పార్టీ అధిష్టానం, ఇటు జిల్లా పార్టీ శ్రేణులు ఈ మహానాడుని విజయవంతం చేయడమే కాకుండా, చిరస్మరణీయ వేడుకగా నిర్వహించడానికి ఇప్పటి నుండే సన్నాహాలు మొదలుపెట్టారు!



భారత ఉపరాష్ట్రపతి సీపి రాధాకృష్ణన్ ఇటీవల తిరుమలకి విచ్చేశారు. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మెన్ బి.ఆర్.నాయుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డిలు ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో దర్శనం చేయించి అనంతరం ఆయనని సత్కరించి స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలని అందజేశారు.



## కృతజ్ఞతాపూర్వక కలయిక

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా బుధవారం నాడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐ.టి మరియు విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌ని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి – వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

# టెన్త్‌లో డా.కిషోర్స్ రత్నం..విద్యార్థుల విజయఢంకా



విద్యార్థినీ విద్యార్థులతో కలిసి విజయం చిహ్నం చూపుతున్న రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్లు, సిబ్బంది

ఏప్రిల్ 30న వెలువడిన పదవతరగతి పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని డా. కిషోర్స్ రత్నం విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఎస్.గేహ్యశ్రీ 600మార్కులకు గాను 596 మార్కులు సాధించిందని, అదేవిధంగా టి.షణ్ముఖప్రియశ్రీ 595, బి.జెస్సిక 595, ఏ.పవన్‌తేజ 595, కె.హన్సిక 594, వివి శ్రీవల్లి 592, డి.తానిక 592, పి.దన్విక 591, ఎస్.చరణ్‌తేజ 595, ఎస్‌కె సారామహీన్ 591, టిబి అఖిల్‌సింగ్ 590, టి.సాత్విక కెరోల్ 590, ఎం.జయదేవ్ 590 మార్కులతో అద్భుత విజయాలు సాధించారని డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈ పరీక్షల్లో తమ విద్యార్థులు 13 మంది 590కి పైగా మార్కులు సాధించారని, 52 మంది 580 మార్కులకుపైగా, 205మంది 550 మార్కులకు పైగా, 386 మంది 500మార్కులకు పైగా సాధించారని ఆయన తెలిపారు. సబ్జెక్టుల వారీగా తెలుగులో 35 మంది, హిందీలో ఒకరు, మ్యాథ్స్‌లో 67 మంది, సైన్స్‌లో 16 మంది, సోషల్‌లో 53 మంది విద్యార్థులు నూటికి నూరుశాతం మార్కులు సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, ఏఓ తుహీన, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 10వ తరగతిలో 'నేతాజీ' ప్రభంజనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో నేతాజీ విద్యాసంస్థల ఛైర్మెన్ ఎం.వి.సుబ్బారెడ్డి, సిబ్బంది

10వ తరగతి ఫలితాల్లో నెల్లూరులోని శ్రీ నేతాజీ (ఎంఎస్‌ఆర్) పైలట్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. తమ విద్యార్థిని లాస్య 600 మార్కులకుగాను 595 మార్కులు సాధించిందని, విద్యార్థులు బివి మనుశ్రీ 593, ఎస్‌కె అబ్దుర్‌రహమాన్ 590, కేపి రూప్‌యాదవ్ 590, ఏ.అనన్య 590వంతున మార్కులు సాధించారని నేతాజీ విద్యాసంస్థల ఛైర్మెన్ ఎంవి నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. మరో 93 మంది విద్యార్థులు 500కి పైగానే మార్కులు సాధించారని తెలిపారు. పాఠశాల ప్రెసిడెంట్ వేదవతి సుబ్బారెడ్డి, డైరెక్టర్లు కె.నరేంద్రరెడ్డి, ఎస్.సుబ్రామ్, డా. అలేఖ్యరెడ్డి, హెడ్మాస్టర్ ఎస్‌విఎల్ నరసింహారావు, ఏఓ చెంచయ్య విద్యార్థులను అభినందించారు.

# విజయదుందుభి మ్రోగించిన విశ్వసాయి డా.ఎస్ఆర్‌కె విద్యార్థులు




పాఠశాల డైరెక్టర్లతో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులు

ఏప్రిల్ 30న విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లోవిశ్వసాయి డా.ఎస్ఆర్‌కె స్కూలు విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారు. పిఎస్‌ఎస్ ప్రణీత 600 మార్కులకు గాను 594 మార్కులు, పి.ఆశ్రిత 592, ఏ.రమ్యహాసిని 591, డి. హర్షిణి 590 మార్కుల వంతున సాధించి అందరి అభినందనలు పొందారు. 580 మార్కులకు పైగా సాధించినవారు 17 మంది, 550కి పైగా 44 మంది, 500కి పైగా 76 మంది ఈ పరీక్షల్లో విజయదుందుభి మ్రోగించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వసాయి డా.ఎస్ఆర్‌కె స్కూలు ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్లు జి.కృష్ణమోహన్, వై. శివసంకేత్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.రఘురాం మాట్లాడుతూ, పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు, అందుకు కృషిచేసిన ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లితండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# సత్తాచాటిన 'విపిఆర్ విద్య'



మానస(594 మార్కులు)ని అభినందిస్తున్న విపిఆర్ దంపతులు

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మానసపుత్రిక, విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న విపిఆర్ విద్య పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. పాఠశాల విద్యార్థులు 100కి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో సీహెచ్ మానస అనే విద్యార్థిని 600కు 594 మార్కులు సాధించి టాప్‌లో నిలిచింది. తర్వాత శ్రీమాన్య 587 మార్కులు, నిదర్శిని 579 మార్కులు సాధించారు. పదో తరగతిలో ఫలితాల్లో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా..31 మంది ఉత్తీర్ణత సాధించి విజయదుంధుబి మోగించారు. వారిలో 28 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. విద్యార్థులు సాధించిన విజయం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని విపిఆర్ క్యాంపు కార్యాలయంలో విపిఆర్ దంపతులను కలిసిన సిహెచ్ మానసను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థిని ఉన్నత చదువులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందిస్తామని వారు స్పష్టం చేశారు. అలాగే పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను, సిబ్బందిని, తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందించారు.


ద్వితీయ వర్ధంతి



నిర్యాణం : 01.05.2024

సేవాస్ఫూర్తి, ఆత్మీయ దీప్తి, మా నాన్న

జక్కా శ్రీనివాసులు రెడ్డి గారు

భౌతికంగా మాకు దూరమై రెండేళ్ళు గడిచాయి.

ఆ మానవీయ మహితాత్మకి నివాళులర్పిస్తున్నాం.

కుమారుడు - కోడలు

భక్తవత్సల రెడ్డి జక్కా - హరిత రెడ్డి జక్కా

కుమార్తె - అల్లుడు

రాధిక రెడ్డి సామంతు - శ్రీరామ్ రెడ్డి సామంతు

లాయర్
మే 01, 2026

# శ్రమకి గుర్తింపు..హక్కులకి రక్షణ ఉండాలి!

*కూటికోసం..కూలికోసం..పట్టణంలో బతుకుదామని తల్లిమాటలు చెవిన పెట్టక..బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం!..ఎంత కష్టం!..* అంటూ మహాకవి శ్రీశ్రీ తన మహాప్రస్థానం కవితలలో ఎంతో మథనపడ్డారు. కర్షకులు, కార్మికులు అనాదిగా బతుకుతెరువు కోసం జీవితమంతా కష్టపడుతున్నా, వారి కష్టాలు మాత్రం నేటికీ తీరడమే లేదు. ఎక్కడ చూసినా కష్టజీవుల రెక్కల కష్టాన్ని, కార్మికుల శ్రమని, కర్షకుల స్వేదాన్ని దోచుకోవడమే తప్ప, వారి పనికి కానీ, వారి జీవితాలకి కానీ, వారి హక్కులకి కానీ భద్రత అన్నదే ఉండడం లేదు. ఏళ్ళు గడిచిపోతున్నా వారి జీవితాల్లో ఆశించినంత మార్పు ఉండడం లేదు. శ్రమదోపిడీ అన్నది నిరంతరం ఒక సర్వసాధారణ కార్యక్రమంగా జరిగిపోతూనే ఉంది. ఇదే అదనుగా పేదరికం, నిరుద్యోగం, సమాజంలోని అసమానతలు కార్మికలోకాన్ని కాటేస్తున్నాయి. ఒక్క భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో ఈ దుస్థితిలో పెద్ద మార్పేమీ ఉండడం లేదు. దానికితోడు యుద్ధాలు, అనేకరకాల సంక్షోభాలు కార్మిక కర్షకుల జీవితాలను, నిరుపేద జీవులను మరింతగా కాల్చుకుతింటున్నాయి. నేటికీ అనేకదేశాల్లో కార్మికులంటే బానిసలుగా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. ఒకప్పుడు పెద్దపెద్ద దేశాల్లో కూడా చిన్నచిన్న కార్మికులను రోజంతా పనిచేయించుకుంటూ వేపుకుతినేవారు. వేకువ నుంచి అర్ధరాత్రి దాకా చాకిరీ చేయించుకునేవారు. ఆ పెట్టుబడిదారుల అమానుష నియంతృత్వ విధానాలపై 1886లో ఒక పెద్ద తిరుగుబాటు జరిగింది. అమెరికాలోని చికాగోలో ఉన్న 'హే మార్కెట్'లో 1886 మే 1న జరిగిన కార్మికుల నిరసన ప్రదర్శనే మే డే ఆవిర్భావానికి దారితీసింది. రోజంతా పని చేస్తూ ఎందరో కార్మికులు అనారోగ్యాలకు గురై మృత్యువు పాలవుతున్నా పట్టించుకోని పెట్టుబడిదారుల దుర్నీతిపై కార్మికులు ఉద్యమించడం ప్రారంభించారు. 8గంటల పని విధానం ఉండాలని కోరుకుంటూ వేలాదిగా కార్మికులు వీధుల్లోకొచ్చి పోరాడారు. పోలీసు కాల్పులు జరిగాయి. వాటికి ఎదురొడ్డి నిలిచిన కార్మికులెందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆ నెత్తురు లోంచి, కార్మికుల బలిదానాల్లోంచి ఎర్రజెండా మొలిచింది. కార్మికులంతా స్వేచ్ఛాపతాకగా ఎర్రజెండాలను చేతపట్టి నిరసనలను మరింత హోరెత్తించారు. 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్ళు తప్ప' అంటూ రోడ్లమీదికొచ్చి గొంతెత్తి నినదించారు. లాఠీలకీ, తూటాలకీ వెరవక ప్రాణాలకి తెగించి ఉద్యమాలకు తెగబడ్డారు. కోట్లాది మంది కార్మికుల త్యాగాలు.. ఉద్యమాల ఫలితంగా మేడే ఆవిర్భవించింది. అదే.. మే1గా.. అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రసిద్ధి చెందింది. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ నినదించిన.. ఆ పోరాటాల స్ఫూర్తిగా 1890 మే 1న బ్రిటన్‌లో జరిగిన ప్రదర్శనల్లో సుమారు 3 లక్షల మందికి పైగానే కార్మికులు పాల్గొనడం అప్పట్లో పెద్ద సంచలనం కలిగించింది. అనేక కార్మికోద్యమాలు మే1నే ప్రారంభమయ్యాయి. దీంతో పలు దేశాలు కూడా మే 1నే మేడేగా ప్రకటించాయి. 1923 మే1న మనదేశంలో కూడా.. మద్రాసులో తొలిసారిగా ఎర్రజెండా రెపరెపలాడింది. కార్మికోద్యమాల ఫలితంగా నవోదయం ప్రారంభమైంది. మేడే రోజును అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా భారత్ సహా ఎన్నో దేశాలు జరుపుకుంటున్నాయి. మేడే ప్రదర్శన అంటే కార్మిక శక్తికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఏటా మేడే ఉత్సవాలు ప్రపంచమంతా సంబరంగా జరుగుతూనే ఉన్నాయి. అయితే, మే డే అంటే ఒక్క కార్మికులకే కాదు. సకల మానవాళికీ పండుగ కావాలి. తమ రెక్కల కష్టంతో పొలాలను పండించి దేశానికి అన్నంపెట్టే రైతన్నలు, రేయింబవళ్లు పరిశ్రమల్లో శ్రమించి ఉత్పత్తులు చేసే కార్మికుల కష్టాలు తీరిపోవాలి. అందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి. అన్నిరంగాల కార్మికుల సమస్యలు తీర్చేందుకు మానవీయ దృక్పథంతో సమాయత్తం కావాలి. కష్టజీవులు కన్నీరుపెట్టకుండా కాపాడుకోవాలి. వారి కుటుంబాలు ఆకలితో అల్లాడిపోకుండా ఆదుకోవాలి. రెక్కలు ముక్కలు చేసుకుంటూ బతికే కోట్లాదిమంది కార్మికుల శ్రమకి తగ్గ గౌరవాన్ని ఇస్తూ, వారి జీవనోపాధికి..వారి హక్కులకి రక్షణ కల్పించాలి. నిరంతరం కష్టించే శ్రమజీవుల వేతనాలకీ-జీవితాలకీ 'తామున్నామంటూ' భరోసా ఇవ్వాలి. ప్రపంచవ్యాప్తంగా చరిత్రాత్మకమైన మే డే రోజునైనా.. ప్రపంచంలోని అన్ని దేశాలు, అన్ని ప్రభుత్వాలు ఆమేరకు ఇకనైనా సత్ సంకల్పం చేసుకోవాలి!.. కార్మికలోకపు సౌభాగ్యానికి.. కర్షకలోకపు కల్యాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలి. చిత్తశుద్ధితో కార్మికుల బాగుకు చేయూతనందించాలి. అప్పుడే మే దినోత్సవానికి.. మానవాళి జీవితాలకీ మరింత సార్ధకత!...

**- నేడే.. మేడే**

# మొకరిల్లిన ఆత్మగౌరవం.. అక్షరసత్యం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

గత వారం మన 'లాయర్' మొదటి పేజీలో 'ఢిల్లీ పెద్దల ముందు మోకరిల్లిన ఆంధ్రుల ఆత్మగౌరవం' అంటూ రాసిన విశ్లేషణ చాలా బాగుంది. బహుశా కూటమి శ్రేణులు 'లాయర్' అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు, కానీ ఆ వ్యాసంలో రాసిన ప్రతీ పదం అక్షరసత్యం. స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించే వరకూ ఉత్తరాది వారు మన తెలుగువారిని కూడా మదరాసీలని పిలిచేవారు. ఆ నానుడిని అన్న గారు పోగొట్టారు. ఉత్తరదేశంలో తెలుగు వాడి సత్తా చాటారు. ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించారు. ఆంధ్రాకి గుర్తింపు తీసుకొచ్చారు. ఆ రోజుల్లోనే నేషనల్ ఫ్రంట్ పేరుతో కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలన్నిటినీ ఒక వేదికపైకి తెచ్చి కాంగ్రెస్‌ని గడగడలాడించారు. ఆత్మగౌరవం నినాదంతో తెలుగువారి మనసులని దోచుకున్నారు. అదే విధంగా దివంగత వై.ఎస్.రాజశేఖర రెడ్డి కూడా కాంగ్రెస్‌పార్టీలోని సీల్డు కవర్ విధానానికి స్వస్తి పలికాడు. తాను కరడు కట్టిన కాంగ్రెస్‌వాదే అయినప్పటికీ ఢిల్లీ పెద్దలు 1989 వరకు ఆచరించిన సీల్డు కవర్ సాంప్రదాయానికి స్వస్తి చెప్పారు. తనని తానే రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రిగా ప్రకటించుకుని 2004లో ఘన విజయం సాధించారు. అదే తరహాలో 2009లో కూడా అధికారాన్ని దక్కించుకుని సీఎం పీఠాన్ని అధిరోహించారు. కాంగ్రెస్ దిగ్గజం సోనియాగాంధీని సైతం ఆయన లెఖ్ఖ చేయలేదు. దక్షిణ భారతదేశం మొత్తం వ్యతిరేకించిన 131 రాజ్యాంగ సవరణ బిల్లుకి ఇటు చంద్రబాబు అటు జగన్మోహన్‌రెడ్డి మద్దత్తు తెలిపి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని యమునా నదిలో కలిపారన్న దాంట్లో ఏమాత్రం సందేహం లేదు! *- యం. చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

# అధ్వాన్నంగా మారిన కొత్తకోడూరు మైపాడు రోడ్డు

నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని కొత్తకోడూరు గ్రామం నుండి మైపాడు బీచ్‌కి వెళ్ళే రోడ్డు పరమ అధ్వాన్నంగా మారింది. అసలు రోడ్డు ఉందా లేదా అన్న అనుమానం కలిగేంత ఘోరంగా గుంతలతో, గతుకులతో నిండిపోయింది. ఈ రోడ్డు మైపాడు నుండి కొరుటూరు వరకూ కోవూరు నియోజకవర్గంలోకి వస్తుంది. అక్కడివరకు రోడ్డు చాలా బాగుంది. కానీ, కొరుటూరు నుండి వెంకన్నపాళెం మీదగా తోటపల్లిగూడూరు మండలంలో వున్న కోడూరు వరకూ వెళ్ళే మార్గం సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఆ రోడ్డు మాత్రం పరమ ఛండాలంగా వుంది. సర్వేపల్లి ఏం.ఎల్.ఏ సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారు ఈ రోడ్డు నిర్మాణ విషయంపై దృష్టిపెట్టాలని కోరుతున్నాను. గత ప్రభుత్వం అయిదేళ్ళు రాష్ట్రంలోని అన్ని రహదారులని గాలికి వదిలేసింది. ముఖ్యంగా పల్లెప్రాంతాలను అస్సలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటిగా అన్ని రోడ్లు బాగుపడుతున్నాయి. మైపాడు నుండి కొరుటూరు వరకు వున్న రోడ్డు కూటమి ప్రభుత్వంలో వేసిందే. అదే తరహాలో కోడూరు–కొరుటూరు రోడ్డుకి కూడా మోక్షం కల్పించాల్సిందిగా ఎం.ఎల్.ఏ గారికి విజ్ఞప్తి.

*కె. సందీప్,* మైపాడు.

# ప్రకృతి 'లక్ష్మణ రేఖలు' దాటుతున్నామా?

మనసులో మాట 95

"స్టేట్ ఆఫ్ ఇండియాస్ ఎన్విరాన్మెంట్" (SOE 2026) తాజా నివేదిక భయం గొలిపే వాస్తవాలను మన కళ్ళ ముందు ఉంచింది. మానవ మనుగడకే సవాలు విసిరే భయంకరమైన వాస్తవాలను తెలిపింది. భూమి తనను తాను రక్షించుకోవడానికి ఏర్పరుచుకున్న తొమ్మిది రక్షణ కవచాల్లో ఇప్పటికే ఏడింటిని మానవుడు నాశనం చేశాడని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా, ఈ ఏడాది 'ఓషన్ అసిడిఫికేషన్' (సముద్రాల ఆమ్లీకరణ) కూడా ఈ ప్రమాదకర జాబితాలో చేరడం మనం ప్రకృతి లక్ష్మణ రేఖలను ఎంత వేగంగా దాటుతున్నామో సూచిస్తోంది.

SOE 2026 నివేదికలోని అత్యంత ఆందోళనకరమైన అంశం భూతాపం పరిమితి. ప్రపంచం 1.5°C ఉష్ణోగ్రత పెరుగుదల అంచున నిలబడి ఉంది. ఇది కేవలం ఒక అంకె కాదు; పర్యావరణ వ్యవస్థలు తిరిగి కోలుకోలేని స్థితికి చేరుకున్నాయని చెప్పడానికి ఒక సంకేతం. 2025లో భారతదేశం దాదాపు 99% రోజుల పాటు విపరీతమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంది. దీనివల్ల 4,419 మంది ప్రాణాలు కోల్పోగా, 1.74 కోట్ల హెక్టార్ల పంట నష్టం వాటిల్లింది. ఈ విపత్తులు కేవలం ప్రకృతి వైపరీత్యాలు కావు, మనం ప్రకృతిపై చేస్తున్న దాడికి ప్రతిచర్యలు. మనం 'అభివృద్ధి' అని పిలుచుకుంటున్న ఈ ప్రయాణం, నిజానికి ప్రకృతి పునాదులను తవ్వేయడమే.

## తీర ప్రాంతాలకు నిశ్శబ్ద ముప్పు

ప్రకృతిలోని ఏడవ లక్ష్మణ రేఖ 'సముద్రాల ఆమ్లీకరణ'. వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను సముద్రాలు అధికంగా పీల్చుకోవడం వల్ల నీటిలోని పీహెచ్ విలువలు మారుతున్నాయి. భారతదేశానికి 7,500 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉంది. సముద్ర నీటిలో ఆమ్ల గుణాలు పెరగడం వల్ల మత్స్య సంపద ఇప్పటికే 15–20% మేర క్షీణించినట్లు నివేదిక వెల్లడించింది. పగడపు దీవులు అంతరించిపోవడం వల్ల సముద్ర తీర ప్రాంతాల సహజ రక్షణ కవచం మాయమవుతోంది. దీనివల్ల సముద్ర మట్టాలు పెరిగి, కొన్ని తీర ప్రాంత నగరాలు మునిగిపోయే ప్రమాదం ఎంతైనా ఉంది.

ఆ నివేదిక మరో విచారకరమైన వాస్తవాన్ని బయటపెట్టింది. భారతదేశంలో కేవలం 15% మందికి మాత్రమే వాయు కాలుష్య పర్యవేక్షణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. అంటే, మిగిలిన 85% మంది ప్రజలు ఏ గాలిని పీల్చుకుంటున్నారు అనేది తెలియదు. ఇక అడవుల విషయానికొస్తే, కాగితంపై అడవుల విస్తీర్ణం పెరిగినట్లు కనిపిస్తున్నా, దట్టమైన అడవుల విస్తీర్ణం మాత్రం 2.1% తగ్గింది. అడవుల నాణ్యత తగ్గడం మరియు 'లాంటానా' వంటి ఆక్రమణ మొక్కల వ్యాప్తి వల్ల పులుల ప్రవర్తనలో మార్పులు వస్తున్నాయి. ఫలితంగా మానవ–వన్యప్రాణి సంఘర్షణలు ఏటా 18% చొప్పున పెరుగుతున్నాయి.

## అభివృద్ధి పేరుతో వినాశనం

మనం ఇప్పుడున్న స్థితి నుండి పూర్తిగా వెనక్కి వెళ్ళలేము, కానీ వినాశన వేగాన్ని తగ్గించాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ 'అపరిమిత వృద్ధి' అనే సిద్ధాంతంపై నడుస్తోంది. కానీ, మనకు ఉన్న వనరులు మాత్రం పరిమితం. పారిశ్రామికీకరణ పేరుతో మనం అడవులను, నదులను నాశనం చేస్తుంటే, అది రాబోయే తరాలకు మనం ఇచ్చే మరణశాసనం కాదా? సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ డైరెక్టర్ సునీతా నారాయణ్ ఈ నివేదికలో ఒక కీలక వ్యాఖ్య చేశారు – మనం ప్రకృతి యొక్క 'అసలు'ని ఖర్చు చేస్తున్నాము, కానీ మనం వాడుకోవాల్సింది కేవలం ప్రకృతి ఇచ్చే 'వడ్డీ'ని మాత్రమే. ఈరోజు మనం చేస్తున్నది ప్రకృతి ఆస్తిని దోచుకోవడమే.

ఈ సంక్షోభం నుండి గట్టెక్కడానికి మనకు సమయం చాలా తక్కువగా ఉంది.

**డీ–కార్బనైజేషన్:**

శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, గ్రీన్ ఎనర్జీ వైపు మళ్లడం ఇప్పుడు ఐచ్ఛికం కాదు, ఒక తప్పనిసరి అవసరం.

**రీజనరేటివ్ అగ్రికల్చర్:**

భూమిని విషపూరితం చేయకుండా, ప్రకృతి సిద్ధంగా సాగు చేసే పద్ధతులను ప్రోత్సహించాలి.

**వ్యక్తిగత బాధ్యత:**

ప్రతి పౌరుడు తన 'కార్బన్ ఫుట్‌ప్రింట్'ను తగ్గించుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో భారత్ కేవలం 12% రీసైక్లింగ్ సామర్థ్యం కలిగి ఉండటం సిగ్గుచేటు. దీనిని మార్చడానికి సామాజిక ఉద్యమం అవసరం.

'ప్లానెటరీ బౌండరీస్' అనేవి కేవలం శాస్త్రవేత్తల గణాంకాలు కావు, అవి భూమి మనకు ఇస్తున్న ఆఖరి హెచ్చరికలు. ఏడు రక్షణ కవచాలను దాటేశాం, ఇంకా మిగిలి ఉన్న రెండు కవచాలనైనా కాపాడుకోకపోతే, రాబోయే తరాలకు మనం ఇచ్చే ఆస్తి కేవలం నివాసయోగ్యం కాని ఒక శిథిలమైన భూమి మాత్రమే. అభివృద్ధి పేరుతో మనం కొనితెచ్చుకుంటున్న ఈ వినాశనాన్ని ఆపాల్సిన సమయం మించిపోతోంది. మనం ప్రకృతితో కలిసి బతకడం నేర్చుకుంటామా, లేక దానిపై యుద్ధం చేసి ఓడిపోతామా? అన్నదే ప్రస్తుత ప్రశ్న. మన మనుగడ మన చేతుల్లోనే ఉంది.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

## వైసీపీ పాలనలో..
# పనులు తక్కువ - ప్రచారం ఎక్కువ
### ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శ


త్రీ ఫేస్ విద్యుత్ లైన్ పనులని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

గత వైసీపీ పాలన అంతా అస్తవ్యస్తంగా, పనులు తక్కువ-ప్రచారం ఎక్కువ అన్నట్లుగా జరిగిందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మనుబోలు మండలం లక్ష్మీనరసాపురంలో కోటి రూపాయల వ్యయంతో పూర్తిచేసిన త్రీఫేస్ విద్యుత్ లైన్లను, ఇతర అభివృద్ధి పనులను ఇటీవల ఆయన ప్రజలకు అంకితం చేశారు. రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్డీఎస్ఎస్‌లో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రూ.108 కోట్లతో త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన ఆ పనులు గత ప్రభుత్వ పాలనలోనే మంజూరయ్యాయని, అయితే, వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదని ఆయన చెప్పారు. వైసీపీ హయాంలో ఇరిగేషన్ పనులు చేయకుండానే కోట్లాదిరూపాయల బిల్లులు చేసుకున్నారని, అంతేకాక వైసీపీ నాయకులు వందల కోట్ల విలువైన గ్రావెల్ దోపిడీకి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పరుగులు పెడుతున్నాయన్నారు.

# అవాకులు చవాకులు పేలితే ఊరుకోం!
### • వైసీపీ నేతలకు మంత్రి నారాయణ హెచ్చరిక

తాము నెల్లూరు నగరంలో చెట్లు నాటడం కోసం కార్పొరేషన్ నుంచి ఒక్క పైసా ఖర్చు చేయలేదని, అయితే వాస్తవాలు తెలుసుకోకుండా తామేదో కుంభకోణాలు చేస్తున్నట్లు ఆరోపణలు చేయడం, అవాకులు చెవాకులు పేలడం మంచి పద్ధతి కాదని, అలాంటివాటిని ఇకపై సహించేది లేదని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ వైసీపీ నాయకులను హెచ్చరించారు. ఇటీవల ఆయన నెల్లూరు 3వ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, వైసీపీ నేతలు తమపై చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వారివన్నీ అసత్య ఆరోపణలేనని కొట్టిపారేశారు. వేసవిలో ఉష్ణోగ్రతను కనీసం 2 డిగ్రీలైనా తగ్గించాలని ప్రతి 5 మీటర్లకు ఒక చెట్టు నాటాలని తాము సంకల్పించామని, కార్పొరేషన్ నుంచి ఒక్కపైసా కూడా తీసుకోకుండా దాతల నుంచి నిధులు సేకరించి ప్రజల కోసం ఆ అభివృద్ధి పనులు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కేవలం చెట్ల కోసమే ఒక దాత రెండు కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చారని, తన స్నేహితులు ట్రీగార్డ్స్ ఏర్పాటుకు సహకరిస్తున్నారని తెలిపారు. దేశవిదేశాల్లో ఉన్న తన స్నేహితులను సహాయం అడుగుతున్నది తన కోసం కాదని, నెల్లూరు


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన మేయర్ సుజాత తదితరులు

నగరాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఇవన్నీ పట్టించుకోకుండా, అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు పెడుతూ, లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం మంచిది కాదన్నారు.

### పేదవిద్యార్థుల సైకిళ్ళ కోసం.. 5కోట్ల సొంత నిధులు

నెల్లూరులో వీఆర్ హైస్కూల్‌ని రోల్‌మోడల్‌గా తయారుచేసినా, దానిపై కూడా విమర్శలు చేయడంలో అర్థం లేదన్నారు. పేద విద్యార్థుల కష్టాలు తెలిసినవాడిగా వారికోసం 5 కోట్ల రూపాయల సొంత నిధులతో 7900 సైకిళ్లను పంపిణీకి సిద్ధం చేశామని, ఇవన్నీ ఇప్పటివరకూ చెప్పుకోలేదన్నారు. విఆర్‌సిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం అమలు చేస్తుంటే, ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్ నారాయణ గ్రూప్స్ ద్వారా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రతిపక్షంవారు ఎన్ని కుట్రలు పన్నినా అభివృద్ధిని అడ్డుకోలేరని ఆయన చెప్పారు. తాము చేస్తున్న పనుల్లో తప్పులేమైనా ఉంటే సద్విమర్శలు చేయండి..సరిదిద్దుకుంటామని కూడా ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 150సార్లు.. రక్తదానం చేసిన మధుసూదన్


మధుసూదన్‌ని సత్కరిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

నెల్లూరులోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో 22 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించి, ఇప్పటివరకు 150 సార్లు రక్తదానం చేసిన.. సీనియర్ మోటివేటర్ మధుసూదన రావు స్వచ్ఛంధ విరమణ పొందిన సందర్భంగా ఏప్రిల్ 27న రెడ్‌క్రాస్ వారు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే ముఖ్యమైన సేవ అన్నారు. రక్తదానంపై అవగాహన పెంచుకుని బాధితులకు ప్రాణదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మోటివేటర్ మధుసూదనరావు రక్తదానాన్ని అందరూ అభినందించారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మెన్ చమర్తి జనార్ధన్‌రాజు, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ కో-ఆర్డినేటర్ బయ్యా ప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ కో-ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్, మోటివేటర్ అరిగెల సాయిరాం, బి.భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశ్రమలకు..ఇక త్వరలోనే అనుమతులు
### • ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు
### • కాలుష్య నియంత్రణబోర్డు నిర్ణయం

పరిశ్రమల వారికి అవసరమైన పర్యావరణ అనుమతులను సత్వరం మంజూరు చేసేందుకు వీలుగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర కాలుష్యం నియంత్రణ బోర్డు ఛైర్మన్ కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ శరవణన్‌లు జిల్లా ప్రాంతీయ కార్యాలయాల స్థాయిలలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లను అందుకోసం ఏర్పాటు చేయడంతో ఎన్నో సమస్యలు తీరనున్నాయి. ప్రధానంగా పరిశ్రమలను ఏర్పాటు చేయదలచిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల కోసం వివిధ అనుమతులతో పాటు కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి కూడా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం సుదీర్ఘ ప్రక్రియను పూర్తి చేయాల్సి వస్తోంది. అందువల్ల అనుమతులలో పలుమార్లు జాప్యం కలుగుతోంది. దీనివల్ల పారిశ్రామికవేత్తలు తమ అనుమతుల కోసం ప్రైవేట్ కన్సల్టెంట్‌లను సంప్రదించాల్సిన అవసరం లేకుండానే నేరుగా కాలుష్య నియంత్రణ బోర్డులోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదిస్తే సరిపోతుందని నెల్లూరు జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు సూపరింటెంటింగ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ తెలిపారు. పరిశ్రమలకు అనుమతులను ఏ విధంగా తీసుకోవాలనే అంశంపై పలువురికి అవగాహన లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారని, వారు దరఖాస్తులకు అవసరమైన పత్రాలను జత చేయడంతో పాటు వివరాలను పూర్తి స్థాయిలో పొందుపరచకపోవడంతో అనుమతులకు సంబంధించి జాప్యం జరుగుతోందని ఆయన తెలిపారు. ఆ లోపాన్ని నివారించేందుకే ఈ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమలతో పాటు కొత్తగా ఏర్పాటుచేసేవారు నెల్లూరు కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

# మనసు ఫౌండేషన్ 'అక్షర సేవలు'..అమోఘం!
### • ఏపీ మీడియా అకాడమీ ఛైర్మెన్ ప్రశంస

నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం కనియంపాడులో ఉన్న మనసు ఫౌండేషన్ వారు చేస్తున్న అక్షరసేవ అమోఘమని ఏపీ మీడియా అకాడమీ ఛైర్మెన్ ఆలపాటి సురేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 28న ఆయన మనసు ఫౌండేషన్‌ను సందర్శించి, అక్కడ పుస్తకాల డిజిటలైజేషన్‌ని, స్కానింగ్-ప్యాకింగ్ వ్యవస్థలను పరిశీలించారు. ఇప్పటిదాకా సుమారు 15వేలకి పైగా పుస్తకాలను డిజిటలైజ్ చేయడం అభినందనీయమన్నారు. ఇవన్నీ భావితరాల వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా మనసు ఫౌండేషన్ అధినేత రాయుడు మాట్లాడుతూ, మార్చి-18, 2018 నుండి మనసు ఫౌండేషన్ పుస్తక ముద్రణ ప్రారంభించిందని, సుమారు 30 మందికి ఉపాధి కల్పిస్తూ, ఈ అక్షరయజ్ఞం ప్రారంభించామని తెలిపారు. ఎవరైనా తమ వద్ద ఉన్న పురాతన మరియు నూతన పుస్తకాలను మనసు ఫౌండేషన్‌కి అందజేసి డిజిటలైజేషన్ ప్రక్రియకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ప్రతినిధులు భాస్కర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆలపాటి సురేష్‌కి డిజిటలైజేషన్ ప్రక్రియని వివరిస్తున్న రాయుడు


డా॥ కె.రవీంద్రనాథ్‌రెడ్డి
M.B.B.S., D.L.O., F.A.G.E.
చెవి, ముక్కు, గొంతు వ్యాధుల స్పెషలిస్ట్
**అడ్రసు మార్పు**
నెల్లూరు, శంకర అగ్రహారం (ఇందిరాభవన్ ప్రక్క వీధి) లో గత 45 సం॥లుగా ప్రాక్టీసు చేస్తున్న డాక్టరుగారు మే 1వ తేది నుండి దగ్గరలోనున్న CJR హైట్స్-రేలా హాస్పిటల్ నందు మారుతున్నారు.
పేషెంట్లు, మిత్రులు, శ్రేయోభిలాషులు గమనించ ప్రార్థన.
కొత్త అడ్రసు
**CJR హైట్స్ - రేలా హాస్పిటల్**
శ్రీ సాయిబాబా గుడి దగ్గర, స్వతంత్ర పార్కు రోడ్డు (సండే మార్కెట్ దగ్గర)
నెల్లూరు. ఫోన్ : 0861-2324869, మొబైల్ : 9490 1020 84



## ప్రపంచ నృత్య దినోత్సవ సంబరంగా

# కళాంజలి 38వ వార్షికోత్సవ సంరంభం

ఏప్రిల్ 26వ తేదీ ఆదివారం సాయంత్రం శాస్త్రీయ, జానపద, సినీ నృత్యాలతో, డప్పు కళాకారుల విన్యాసాలతో నెల్లూరు పురమందిరం సందడిగా మారింది. ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'అనంత్' కళాంజలి 38వ వార్షికోత్సవం ఆనంద సంబరంగా వినోదాల సంరంభంగా జరిగింది. ఈ సందర్భంగా సుప్రసిద్ధ నాట్య గురువు శ్రీ గురుకృపా కళాక్షేత్రం వ్యవస్థాపకురాలు శ్రీమతి సురభి గాయత్రి – శివకుమార్ దంపతులని కళాంజలి బృందం సత్కరించింది. 'నాట్య కళామయి' బిరుదుతో గాయత్రిని గౌరవించింది. దశాబ్దాల కాలంగా నాట్య విభాగంలో తమ సేవలు అందించిన, అందిస్తున్న శ్రీమతి భవాని, సామ్యూల్, వేళాంగిణి రాజు, ఆర్.నారాయణమూర్తి తదితరులని కళాంజలి గుర్తించి సన్మానించింది. అలాగే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రతిష్ఠాత్మక 'కళారత్న' అందుకున్న ప్రముఖ కవి చిన్ని నారాయణ రావుని కూడా వేదికపైకి పిలిచి అభినందించింది. కళాంజలి అనంత్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న టెలిఫిలిం "మేక్ ఇన్ ఇండియా" పోస్టర్‌ని కూడా అతిథులు ఆవిష్కరించారు. ఈ సంబరంలో పాల్గొని తమ నృత్యాలతో పురమందిరం వేదికపై ఆనంద తాండవం చేసిన నృత్య కళాకారులకి తర్ఫీదు ఇచ్చిన నాట్యగురువులు శ్రీమతి కల్పన వెంకటేష్, సంధ్యా శేఖర్, మధు, కోలాటం నాని, డప్పు ఈశ్వరయ్యలని ప్రశంసించి జ్ఞాపికలని అందజేశారు.

కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ నూమరసు సత్యనారాయణ, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, శుభమస్తు, కాంచీపురం పెరుమాళ్ వంటి వస్త్ర షోరూంల అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్, వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు ఈ వేడుకలలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.



'కళాంజలి' పురస్కారాన్నందుకుంటున్న సురభి గాయత్రి - శివకుమార్ దంపతులు



కళాంజలి సత్కారాలందుకుంటున్న చిన్ని నారాయణరావు, భవాని, సామ్యూల్, వేళాంగిణి రాజు



'మేక్ ఇన్ ఇండియా' షార్ట్‌ఫిలిం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

### మే 31 దాకా..

## ఉచిత యోగా శిక్షణ

జిల్లా క్రీడా అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆమేరకు బ్రోచర్‌ను ఈనెల 28న నిర్మల నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో కూడా ఉదయం 6.30 నుంచి 7.30 వరకు శిక్షణ ఇస్తామని నిర్వాహకులు యోగా మాస్టర్లు ప్రసన్నకుమార్, రవీంద్ర తెలిపారు.

### అద్భుతం..

## 'అయోధ్య నమూనా ఆలయం'

- అభినందించిన పొంగూరు రమాదేవి

నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లోని ఏస్వీజీఎస్ కాలేజ్ గ్రౌండ్‌లో శ్రీ వెంకటేశ్వర ఎగ్జిబిషన్ వారు ఏర్పాటు చేసిన అయోధ్య బాలరాముడి నమూనా ఆలయం అద్భుతంగా ఉందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి అభినందించారు. ఇటీవల ఆమె ఆ నమూనా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేకపూజలు చేశారు. ఈ ఆలయాన్ని చూస్తుంటే, సాక్షాత్తు అయోధ్య



రామ మందిరమే మన నెల్లూరు నగరానికి తరలివచ్చినట్లుగా ఉందన్నారు. 1.50కోట్ల భారీ వ్యయంతో మందిర నమూనాను నిర్మించారని, ప్రతి ఒక్కరూ అయోధ్య బాలరాముడిని దర్శించుకునే నమూనా ఆలయం ఒక సువర్ణావకాశమని, ఇంకా ఈ ఎగ్జిబిషన్‌లో ఎన్నో ప్రత్యేకతలున్నాయని రమాదేవి తెలిపారు.






# నెల్లూరు కబుర్లు

### లోకేష్ కృషితోనే..

## రాష్ట్రానికి గూగుల్

**ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి**



చంద్రబాబు, లోకేష్ కటౌట్‌లకి క్షీరాభిషేకం చేస్తున్న కోటంరెడ్డి సోదరులు

యువనేత నారా లోకేష్ కృషివల్లనే విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని. ఐటి రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులతో రాష్ట్రానికి దశ-దిశ మార్చబోతోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనాయకుడు లోకేష్‌ల కటౌట్‌లకు ఆయన పాలాభిషేకం చేశారు. ఏప్రిల్ 28న నెల్లూరులోని తమ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, భావితరాల భవిష్యత్తుకు గూగుల్ సెంటర్ ఒక బంగారుబాట అవుతుందన్నారు. అందువల్ల లక్షలాదిమందికి ఉద్యోగావకాశాలు కూడా రాబోతున్నాయన్నారు. ఉత్తరాంధ్ర యువతకు, రాష్ట్ర భవితకు ఇదొక అపూర్వ అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే..చర్యలు తప్పవు

**- హోటళ్ళ వారిని హెచ్చరించిన కలెక్టర్ -**



హోటల్లో పదార్థాలను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు

"నగరంలోని హోటళ్ళను ఎప్పుడైనా ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం... ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం" అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. నగరంలోని పలు హోటళ్లను ఆయన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా లేవని, శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బిర్యానీని స్వయంగా పరిశీలించారు. కిచెన్‌లో ఉన్న చికెన్‌ను ప్లాస్టిక్ కవర్లలో ఉంచకూడదని, పెరుగు ప్యాకెట్ ఎక్స్పైరీ డేట్ గడువు ఒక్కరోజుతో ముగుస్తుంటే ఇంకా ఎందుకు వాడకుండా ఉంచారని నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రజలకు నాణ్యమైన తాజా ఆహార పదార్థాలను అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా నిల్వ ఉంచకూడదని సూచించారు. వినియోగదారుల నుంచి హోటళ్ళపై ఏ ఒక్క ఫిర్యాదు అందినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కార్డన్ సర్చ్ కొనసాగించాలి

నగరంలో శాంతి భద్రతలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పోలీసులు కృషిచేయాలని, కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లు విస్తృతంగా కొనసాగించాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. ఏప్రిల్ 28న నెల్లూరులోని నగర డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ పరిశీలించారు. వేదాయపాళెం, నవాబుపేట ఔట్‌పోస్టుల ఏర్పాటు పురోగతిని ఆమె ఏఎస్పీ దీక్షను అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ మ్యాపింగ్ సాయంతో క్రైమ్ స్పాట్‌లను గుర్తించాలన్నారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల వాడకాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## వెయ్యేళ్ళ నాటి కృష్ణపట్నం

# సిద్ధేశ్వరాలయానికి పూర్వవైభవం కల్పిస్తాం!

### మంత్రి ఆనం



సిద్ధేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఎట్టకేలకు జిల్లాలోని అతి పురాతన ఆలయాల్లో ఒకటైన కృష్ణపట్నం సిద్ధేశ్వరాలయానికి కొత్త వెలుగు రాబోతోంది. వెయ్యేళ్ళ క్రితం చోళులు నిర్మించిన సిద్ధేశ్వరాలయానికి పూర్వ వైభవం కల్పించేందుకు మంత్రి ఆనం చొరవతో రాష్ట్ర దేవాదాయశాఖ సిద్ధమవుతోంది. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో అత్యంత ప్రాచీనమైన శ్రీ కామాక్షిదేవి సమేత సిద్దేశ్వరాలయాన్ని ఇటీవల ఆయన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పురావస్తుశాఖ చీఫ్ మునిరత్నంరెడ్డి, పురావస్తు అధికారులు, దేవాదాయశాఖ అధికారులతో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాక్షాత్తూ దేవతలే దిగివచ్చి ఇక్కడ ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి అని, ఎంతో విశిష్టమైన ఈ పురాతన ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. 10, 11వ శతాబ్దాల మధ్య చోళులు నిర్మించిన ఆలయంలో నాటి ప్రాచీనత దెబ్బతినకుండా, వెయ్యేళ్ల నాటి శిల్పకళా నైపుణ్యం చెక్కుచెదరకుండా ఉన్నవి ఉన్నట్లుగా పునర్నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆర్కియాలజీ అధికారులు, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఆర్కియాలజీ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి ఈ అంశం పట్ల అధ్యయనం చేస్తున్నామన్నారు. మన పూర్వీకులు గొప్ప వారసత్వ సంపదగా మనకు అందించిన ఈ చారిత్రాత్మక ఆలయం ఎంతో అపురూపమైనదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు దేవాదాయశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఆలయంలో నిత్యం పూజాకార్యక్రమాలు నిర్వహించేందుకు ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా 6170 ఆలయాలకు ప్రతినెలా ఒక్కొక్క ఆలయానికి రూ.10వేలు చొప్పున అందిస్తున్నామని, ఏటా 74 కోట్లు ఈ పథకానికి ఖర్చు చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణం, జీర్ణోద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తాజాగా మొత్తం 706 ఆలయాల పునర్నిర్మాణం కోసం 832 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.



# శ్రీసిటీలో.. 'అపోలో హెల్త్ కేర్' సేవలు!

వైద్య ఆరోగ్య రంగంలో దేశంలో పేరుగాంచిన అపోలో హాస్పిటల్స్ సంస్థ శ్రీసిటీలో ఆధునిక సాంకేతికత ఆధారిత ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు పెద్ద పట్టణాలకే పరిమితమైన నాణ్యమైన వైద్య సేవలను పరిశ్రమలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యంగా ఆ సంస్థ వెల్లడించింది. ఇటీవల అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డా. ప్రతాప్ సి రెడ్డి దీనిపై స్పందిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజమే దేశ అభివృద్ధికి పునాది అన్నారు. ఆసుపత్రుల పరిమితులను దాటి ప్రజల దగ్గరకు వైద్య సేవలను తీసుకెళ్లడం తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. శ్రీసిటీలో సేవల విస్తరణ ద్వారా పరిశ్రమలతో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, అపోలో హాస్పిటల్స్ భాగస్వామ్యం ద్వారా శ్రీసిటీ నివాసితులు, పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై శ్రీసిటీ మెడికల్ సెంటర్‌ను పూర్తిగా అపోలో నిర్వహించనుండగా, ఓపిడీ సేవలు, అత్యవసర చికిత్స, 24 గంటల ఫార్మసీ, డయాగ్నస్టిక్ ల్యాబ్, ఎక్స్‌-రే, రేడియాలజీ, ఆరోగ్య పరీక్షలు వంటి సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి.

## శ్రీసిటీని సందర్శించిన విద్యుత్‌మంత్రి గొట్టిపాటి





మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న రవి సన్నారెడ్డి

ఇటీవల రాష్ట్ర పరిశ్రమల మంత్రి గొట్టిపాటి రవికుమార్ శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండి శివశంకర్ లోతేటి, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, ఇతర విద్యుత్ అధికారులతో కలసి శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పరిశ్రమల ప్రతినిధులు, శ్రీసిటీ యాజమాన్యంతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలోని కొల్లడం వద్ద ఏపీ ట్రాన్స్‌కో నిర్మిస్తున్న 132/33 కెవి సబ్‌స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రికి విన్నవించారు. శ్రీసిటీ విస్తరణ దృష్ట్యా జపాన్ క్లస్టర్ సమీపంలో మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం అవసరమని ఆయన వివరించారు. శ్రీసిటీ యాజమాన్యం చర్యలను ప్రశంసించిన మంత్రి, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, విద్యుత్ టారిఫ్‌ల తగ్గింపు వంటి అంశాలతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.





## 8వ వర్థంతి

## శ్రీ గణపం ఓబులరెడ్డి గారు

జననం: 16.12.1939 నిర్యాణం: 05.05.2018

అమృతమూర్తి దివ్యస్మృతికి మా నివాళి.

- కుటుంబసభ్యులు

# శ్రీసిటీలో సమ్మర్ క్యాంప్

**• విద్యార్థులకు విద్య, నైపుణ్య, శారీరక శిక్షణ**

ఏప్రిల్ 27 నుంచి శ్రీసిటీలో 8, 9, 10వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్ (వేసవి శిక్షణా శిబిరం) నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో విజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కోర్సులతో దీనిని రూపొందించారు. ఏప్రిల్ 27 నుండి మే 29 వరకు సోమవారం నుండి శుక్రవారం వరకు అన్ని పని దినాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్య, నైపుణ్య, శారీరక శిక్షణ కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కంప్యూటర్ కోర్సు, ఇంగ్లీష్ గ్రామర్, వ్రాత నైపుణ్యాలు, గణిత సూత్రాలు, పోటీ పరీక్షల మెళకువలు, జనరల్ నాలెడ్జి, ప్రపంచ వార్తలు తదితర అంశాలను కూడా ఈ శిక్షణలో పొందుపర్చారు. శారీరక శిక్షణలో భాగంగా యోగా, స్పోర్ట్స్, గేమ్స్ నేర్పించనున్నారు. ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పిస్తారు. పరిశ్రమలు, విజ్ఞాన కేంద్రాల సందర్శనలు చేపడతారు. ఇరుగుళం జెడ్పి హైస్కూల్ ఆవరణలో ఈ క్యాంపు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే వారందరికీ భోజన సదుపాయం మరియు రాళ్ళకుప్పం, శ్రీసిటీ జీరో పాయింట్ నుంచి వాహన సదుపాయం కల్పిస్తున్నారు.

# 'జనసేన'..చలివేంద్రం




చలివేంద్రంలో మజ్జిగను పంపిణీ చేస్తున్న గునుకుల కిషోర్, చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి, తుపాకుల మునెమ్మ

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు ట్రంక్‌రోడ్‌లోని గాంధీబొమ్మ కూడలి వద్ద "డొక్కా సీతమ్మ మజ్జిగ చలివేంద్రం"ను ప్రారంభించారు. 'మెగా' కుటుంబ అభిమాని తుపాకుల మునెమ్మతో కలిసి ప్రజలకు చల్లని మజ్జిగ అందించారు. గత సంవత్సరం దాదాపు పది సెంటర్లలో వేలాది లీటర్ల మజ్జిగ పంపిణీ చేసినట్లే, ఈ సంవత్సరం కూడా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని ఆయన చెప్పారు. జనసేన నేత..జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సూచనల మేరకు నగరంలోని ముఖ్య కూడళ్లలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. బ్లూ బోర్డ్స్ సంస్థ అధినేత వేముల శివకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, జనసేన నాయకులు అశోక్, గునుకుల విజయలక్ష్మి, చిట్టమూరు ప్రవీణ్‌రెడ్డి, రుషి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో...

నెల్లూరు చిన్నబజార్‌లో ఆర్యవైశ్యులు 'ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంతపేట సీఐ వైవీ సోమయ్య ప్రారంభించారు. ఈ చలివేంద్రం రెండునెలల పాటు కొనసాగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్రకుమార్, కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, పచ్చిపులుసు కృష్ణ, తులసీ వెంకటసురేంద్ర, అమరా శివ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ కృష్ణమూర్తి..ఇక లేరు!



మంచిమనసున్న వైద్యునిగా, అందరితో ఎంతో ఆత్మీయంగా ఉండే పెద్దాసుపత్రి డాక్టర్ కృష్ణమూర్తి ఇకలేరు. ఈనెల 27వ తేదీ సోమవారం సాయంత్రం గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు ఆయన్ను నగరంలోని కిమ్స్ వైద్యశాలకి తరలించగా, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పెథాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి, గతంలో నెల్లూరు పెద్దాసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జిగా దీర్ఘకాలం పనిచేశారు. సేవాగుణంతో పనిచేసే వైద్యునిగా ఆయనకు పేరుంది. స్వచ్ఛంధ రక్తదానాన్ని బాగా ప్రోత్సహించి అందరి ప్రశంసలు, ఉన్నతాధికారుల నుంచి అవార్డులు అందుకున్నారు. ఆయన హఠాన్మరణం చెందారని తెలియగానే ఆయన సహచరులు, ఆత్మీయులు శోక సముద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, పలువురు వైద్యులు, వైద్యసంఘాల వారు ఆయన మృతికి విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. పెద్దాసుపత్రిలో పనిచేసిన డాక్టర్ నరేంద్ర కూడా ఇటీవలే గుండెపోటుతో మరణించడం, ఇప్పుడు డాక్టర్ కృష్ణమూర్తి మృతి చెందడంతో వైద్యకళాశాల–పెద్దాసుపత్రి వైద్యవర్గాల్లో విషాదం అలముకుంది.

### మే 3న..

# నారద జయంతి



నెల్లూరులోని సాహితీ సుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 3న దేవర్షి నారద జయంతి జరుగనుంది. లోక కల్యాణం కోసం, ధర్మప్రతిష్టాపన కోసం తపించిన పురాణ పురుషుడైన నారద మహర్షి ఆదర్శాలను గుర్తుచేసుకుంటూ, స్థానిక విజయమహల్ గేటు వద్దనున్న హోటల్ విశ్రాంత్‌లో ఈ కార్యక్రమం జరుగనుంది. ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారప్రముఖ్ బయ్యా శ్రీనివాసులు(వాసు) జ్యోతిప్రజ్వలనతో సభ ప్రారంభం కానుంది. 'లాయర్' వార్తాపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, సీనియర్ జర్నలిస్టు సురేష్ కొచ్చాటిల్ (హైదరాబాద్) ప్రధాన వక్తగా పాల్గొంటారని ఫౌండేషన్ నిర్వాహకులు నరహరి సురేష్, చింతాల ఉదయ్ తెలిపారు.

# భగవద్గీతతో జ్ఞానశుద్ధి

**డా.కె గిరిజాలక్ష్మి**



గిరిజాలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

భగవద్గీత పవిత్రగ్రంథమని, గీత పారాయణంతోనే జ్ఞానశుద్ధి కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికోపన్యాసకురాలు డా.కె.గిరిజాలక్ష్మి చెప్పారు. జగద్గురు శంకరాచార్యుల వారు స్మరణోత్సవాల్లో భాగంగా, నెల్లూరు పొగతోటలోని ఆది శంకర ధ్యానమందిరంలో జరుగుతున్న కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత పారాయణం పుణ్యప్రదమన్నారు. తొలుత స్వామి సమయానంద సాథస్వామి పూజలు చేసి ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ..చక్రాల ఆనంద్‌కుమార్; సత్యనారాయణ, సుభద్రాదేవి, వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా..

# శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి విశేష అలంకారాలు, అభిషేకాలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని, కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

# 'టెక్నాలజీ'ని తెలివిగా ఉపయోగించుకోవాలి!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ఈ రోజుల్లో చదువు అంటే కేవలం పుస్తకాలు, నోట్స్, గురువు చెప్పిన విషయాలు మాత్రమే కాదు. సాంకేతికత (టెక్నాలజీ) అనే కొత్త విధానం విద్యార్థి జీవితంలోకి వచ్చి, చదువును సులభం చేస్తూ, వేగవంతం చేస్తూ, కొత్త అవకాశాలను కల్పిస్తోంది. కానీ అదే టెక్నాలజీ, సరిగ్గా ఉపయోగించకపోతే, అదొక దారి తప్పించే శక్తిగా మారుతుంది. సాంకేతికతను తెలివిగా ఉపయోగిస్తే అది విద్యార్థికి ఆశీర్వాదం; అజాగ్రత్తగా ఉపయోగిస్తే అది ఆటంకం. చదువులో టెక్నాలజీని ఎలా ఉపయోగించాలి, ఎప్పుడు ఉపయోగించాలి.. వంటివి నేర్చుకోవడం ఈ కాలంలో ప్రతి విద్యార్థికి అవసరం. టెక్నాలజీ అనేది పుస్తకాలకు ప్రత్యామ్నాయం కాదు; పుస్తకాలను అర్థం చేసుకోవడానికి సహాయక సాధనం మాత్రమే అని గుర్తించాలి. ఉదాహరణకు, ఒక విద్యార్థి సైన్స్‌లో "ఫోటోసింథసిస్" అనే భావాన్ని అర్థం చేసుకోవడానికి యూట్యూబ్‌లో ఒక చిన్న యానిమేషన్ వీడియో చూస్తే, ఆ భావం అతని మనసులో స్పష్టంగా నిలుస్తుంది. కానీ, అదే విద్యార్థి వీడియోలు చూస్తూ గంటల తరబడి సమయం వృథాచేస్తే, అది చదువుకు సహాయం కాదు, అడ్డంకిగా మారిపోతుంది.

### దారి తప్పితే దూరం పెరుగుతుంది :

చదువులో టెక్నాలజీని తెలివిగా ఉపయోగించడంలో రెండో ముఖ్యమైన అంశం. దృష్టి నియంత్రణ. మొబైల్, టాబ్లెట్, ల్యాప్‌టాప్ అన్నీ రెండువైపుల కత్తులే. ఒకవైపు అది జ్ఞానానికి ద్వారం; మరోవైపు దృష్టి చెదరగొట్టే పరికరం. ఒక విద్యార్థి "ఒక వీడియో మాత్రమే చూస్తాను" అని యూట్యూబ్ తెరిస్తే, పక్కనే కనిపించే సూచన వీడియోలు అతన్ని మరో దారికి లాగుతాయి. "దారి తప్పితే దూరం పెరుగుతుంది" అనే లోకోక్తి ఇక్కడ మరింత నిజం. టెక్నాలజీని చదువులో ఉపయోగించాలంటే, దృష్టిని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమైనది. చదువుకు సంబంధించిన యాప్‌లు, వెబ్‌సైట్లు మాత్రమే తెరవడం, నోటిఫికేషన్లు ఆఫ్ చేయడం, చదువుతున్నప్పుడు ఫోన్‌ను "డూ నాట్ డిస్టర్బ్"లో పెట్టడం.. ఇలాంటి చిన్న జాగ్రత్తల వల్ల మేలు కలుగుతుంది. ఇకపోతే, సమాచారాన్ని వడపోసుకోవడం మరో ముఖ్యమైన అంశం. ఇంటర్నెట్‌లో సమాచారం ఒక మహా సముద్రం లాంటిది. అందులో మంచి సమాచారం ఉంటుంది. కొంత తప్పుడు సమాచారం కూడా ఉంటుంది. అందువల్ల ముందుగా వాటిలో ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు అన్నది విద్యార్థి తెలుసుకోవాలి. ఉదాహరణకు, చరిత్రలో ఒక సంఘటన గురించి చదువుతున్నప్పుడు, వికీపీడియా మీద మాత్రమే ఆధారపడితే తప్పులువచ్చే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వ వెబ్‌సైట్లు, విద్యా సంస్థల పాఠ్యపుస్తకాలు, విశ్వసనీయ వనరులు వంటివాటిని చూస్తే, పూర్తి సమాచారం ఖచ్చితంగా దొరుకుతుంది. వడపోసిన సమాచారమే చదువుకు ఉపయోగపడుతుంది. మంచి సమాచారం తీసుకోవాలి. ఉదాహరణకు మొబైల్‌లో నోట్స్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఒకే పరీక్షకు సిద్ధమవుతున్నారు. మధ్యలో సోషల్ మీడియా నోటిఫికేషన్ల వలన ఒకరి దృష్టి చెదిరిపోతుంది. కానీ, ఇంకొకరు నోటిఫికేషన్లు ఆపి, చదువుకు సంబంధించిన యాప్‌లను మాత్రమే తెరిచాడు. ఇద్దరూ టెక్నాలజీనే ఉపయోగిస్తున్నారు, కానీ ఫలితం మాత్రం భిన్నం. రెండో విద్యార్థి చదివినది మాత్రం నిలుస్తుంది. సాధనం ఒకటే, ఉపయోగం వేరుగా ఉంటుంది.

### సమయాన్ని వృథా చేసుకోకూడదు :

టెక్నాలజీని చదువులో ఉపయోగించడంలో మరో ముఖ్యమైన అంశం. పునరావృతం.. అంటే పుస్తకాన్ని మళ్లీ చదవడం మాత్రమే కాదు; టెక్నాలజీ ద్వారా నేర్చుకున్న విషయాలను మళ్లీ గుర్తు చేసుకోవడం. ఉదాహరణకు, ఒక విద్యార్థి గణితంలో "సమీకరణాలు" అనే అధ్యాయం నేర్చుకున్న తర్వాత, ఆన్‌లైన్‌లో చిన్న చిన్న పరీక్షలు రాస్తూ సాధన చేస్తే, అతని అర్థం మరింత బలపడుతుంది. పునరావృతం లేకపోతే, టెక్నాలజీ ద్వారా నేర్చుకున్నది కూడా త్వరగా మరిచిపోతాం. టెక్నాలజీని తెలివిగా ఉపయోగించడంలో మరో ముఖ్యమైన అంశం..సమయనియంత్రణ. టెక్నాలజీ మనకు సమయం ఆదా చేయడానికి వచ్చింది, సమయం వృథా చేయడానికి కాదు. ఒక విద్యార్థి "ఇంకా ఐదు నిమిషాలు మాత్రమే" అని వీడియో చూస్తూ, గంటల తరబడి సమయం కోల్పోవచ్చు. కానీ తెలివిగా చదివే విద్యార్థి టెక్నాలజీని సమయాన్ని పొదుపు చేసుకోవడానికి ఉపయోగిస్తాడు. అందుకే సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుకోవాలి. మరో కీలక అంశం..సృజనాత్మకత. టెక్నాలజీ కేవలం చదవడానికి మాత్రమే కాదు; కొత్త అంశాలను సృష్టించడానికి కూడా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, ఒక విద్యార్థి చరిత్రలో "స్వాతంత్ర్య ఉద్యమం" అనే అధ్యాయం చదివిన తర్వాత, ఆ అధ్యాయంపై ఒక చిన్న ప్రెజెంటేషన్ తయారుచేస్తే, ఆ విద్యార్థి చెప్పదలచుకున్నది మరింత లోతుగా ఉంటుంది. సైన్స్‌లో ఒక ప్రయోగం గురించి చదివిన తర్వాత, దాని యానిమేషన్‌ను ఆన్‌లైన్‌లో చూసి, తన మాటల్లో ఒక చిన్న వివరణ రాస్తే, ఆ విద్యార్థి జ్ఞానం మరింత బలపడుతుంది. అందుకే, టెక్నాలజీని చదువులో తెలివిగా ఉపయోగించడం అనేది కేవలం నైపుణ్యం కాదు..అది ఒక కళ. ఆ కళలో సమతుల్యత, నియంత్రణ, దృష్టి, వివేకం అన్నీ అవసరమే. టెక్నాలజీ మనకు సహాయం చేయడానికి ఉంది, మనల్ని నియంత్రించడానికి కాదు. టెక్నాలజీని మనం ఎలా ఉపయోగిస్తామన్న అంశమే మన విజయాన్ని నిర్ణయిస్తుంది. టెక్నాలజీని తెలివిగా ఉపయోగించే విద్యార్థి, ఈ డిజిటల్ యుగంలో ఏ పరీక్షలోనైనా ధైర్యంగా రాణిస్తాడు. విజయాలెన్నో సాధిస్తాడు కూడా!..



వచ్చే వారం : చదువులో దృష్టి :
డిజిటల్ ప్రపంచాన్ని జయించే మార్గం!

E-mail: reddyu@gmail.com

## వెంకయ్యనాయుడు చేతులమీదుగా..మే 2న
# 'విశ్వంభరుడు' గ్రంథావిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత, వెంకయ్యస్వామి భక్తుడు.. దంపూరు రామకృష్ణ ఇటీవల 'విశ్వంభరుడు' పేరుతో రచించిన గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి చరిత్రను భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మే 2న ఆవిష్కరించనున్నారు. గొలగమూడిలోని శ్రీ వెంకయ్యస్వామివారి సన్నిధిలో ఆరోజు ఉదయం 8.45 గంటలకు ఈ ఆవిష్కరణోత్సవం జరుగుతుందని రచయిత తెలిపారు. ఆవిష్కరణ అనంతరం తొలి ప్రతిని మాజీమంత్రి..సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్వీకరిస్తారని, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ వారు, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, పేర్నాటి ఆదిశేషారెడ్డి, నెల్లూరు డోలేంద్రప్రసాద్, తుంగా శివప్రభాత్‌రెడ్డి, జివి రమణారెడ్డి తదితరులు పాల్గొంటారని, వెంకయ్యస్వామివారి భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# రామాయణంపై ఉపన్యాసాలు



సత్కారం అందుకుంటున్న ప్రధాన వక్త ఐనవోలు శ్రీనివాస చక్రపాణి

నెల్లూరులోని పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక 3వమైలులో ఉన్న రామకృష్ణ మిషన్‌లో ఇటీవల శ్రీమద్రామాయణంపై ఉపన్యాసాలు ప్రారంభమైనాయి. మిషన్ కార్యదర్శి స్వామి హృదానంద జీ మహారాజ్ ఈ సమావేశాలను ప్రారంభించారు. పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి డా. చీమకుర్తి వేంకటేశ్వర రావు సభా సంచాలకులుగా వ్యవహరించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఐనవోలు శ్రీనివాస చక్రపాణి 'రామాయణంలోని బాలకాండ'పై ఉపన్యసించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజియన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు సభా పోషకులుగా వ్యవహరించారు. అనంతరం వక్తను సన్మానించారు. రామకృష్ణమిషన్ ప్రవచకులు డాక్టర్ మోహనరాజు, సారస్వతవేత్తలు చక్రపాణి, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, నాగరాజారావు, సి.జయప్రసాదు, కోట శ్రీరామమూర్తి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచీ..
# మొలక పోలేరమ్మ జాతర

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో మే 5, 6, 7తేదీల్లో గ్రామదేవత శ్రీ మొలక పోలేరమ్మ జాతర వైభవంగా జరుగనుంది. దాదాపు 21 ఏళ్ల తర్వాత గ్రామ దేవతకు జాతర నిర్వహిస్తుండటంతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర విజయవంతంగా నిర్వహించాలంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల నెల్లూరు ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాతరను నిర్వహించాలన్నారు.

## గిరిజన యువతకు..
# ఉచిత శిక్షణ

జిల్లాలో గిరిజన యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, గిరిజనులు ఆమేరకు ఐటీడీఏ కార్యాలయంలో మే10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ అసోసియేట్, జూట్‌బ్యాగ్‌ల తయారీ, బేల్దారి, వ్యవసాయ డ్రోన్లు, ఎల్‌ఎంవీ డ్రైవింగ్, బ్యూటీషియన్, టైలరింగ్‌లలో శిక్షణ ఇస్తామని, శిక్షణా కాలంలో వారికి ఉచిత భోజనం, వసతి సౌకర్యం కూడా ఉంటాయని తెలిపారు.

## గ్రామ దేవత రాపూరమ్మ తల్లికి..
# నేదురుమల్లి ప్రత్యేక పూజలు



రాపూరమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ తల్లికి వెంకటగిరి నియోజవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు, రాపూరు మండల వైసీపీ నాయకులు స్వాగతం పలికారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక అభిషేకం చేసి, నేదురుమల్లి పేరుతో అర్చన నిర్వహించారు. పూజ అనంతరం హారతి ఇచ్చి, తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణాభివృద్ధి బాగా జరగాలని, వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఈ సందర్భంగా నేదురుమల్లి అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని డప్పులు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. వారి వెంట రాష్ట్ర ఎస్ఇసి సభ్యులు పాపకన్న మధుసూదనరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు నారాయణరెడ్డి, మండల సీనియర్ నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, రాపూరు మండల అధ్యక్షుడు మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌ను కలిసిన..
# ఎన్‌బీకేఆర్ బీఈడీ పూర్వ విద్యార్థులు

కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాల 2000-2021 విద్యా సంవత్సరం విద్యార్థులు ఇటీవల వాకాడులోని నేదురుమల్లి నివాసంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. మే 3వ తేదీన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరగనున్నదని వారు తెలిపారు. అప్పటి ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి కూడా రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆ సమ్మేళనానికి రావాలని ఆహ్వానించారు.

# గూడూరు డివిజన్

## జనగణనలో..
# ప్రజలు భాగస్వాములు కావాలి




జెండా ఊపి 5కె రన్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

ప్రజలు జనగణనలో వివరాలు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరులో పురపాలక కార్యాలయం వద్ద జనగణన-2026లో భాగంగా ఇటీవల 5కె రన్‌ని ఆర్డీవో సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సర్వేలో సమాచారం అందిస్తే ప్రభుత్వ పథకాలు పోతాయనే అపోహలు వద్దని చెప్పారు. సిబ్బంది ఇళ్ళ వద్దకు వచ్చినపుడు వివరాలు నమోదు చేసుకోవాలని, లేకుంటే ఆన్‌లైన్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తగినంత ఇంధనం ఉంది
## రెవెన్యూ డివిజనల్ అధికారి



పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రతి పెట్రోల్ బంక్ వద్ద రెవెన్యూ సిబ్బందిని మరియు పోలీస్ సిబ్బందిని నియమించడం జరిగిందని గూడూరు రెవెన్యూ డివిజన్ అధికారి సత్యనారాయణ తెలియజేశారు. ఇంధన సరఫరా, నిల్వలు, పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వ దాచిపెట్టడం లేదా బ్లాక్ మార్కెటింగ్ జరిగినట్లయితే, సంబంధితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా సాధారణ స్థితికి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు.

# వృద్ధాశ్రమానికి నూతన భవనం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో కుందా సందీప్‌రెడ్డి దాతృత్వంతో వారి తల్లి కుందా సుహాల్ లత జ్ఞాపకార్థం ఎనిమిది లక్షల రూపాయలు వ్యయంతో గ్రౌండ్ ఫ్లోర్ పునరుద్ధరణ మరియు ఒకటవ అంతస్తు నూతన భవన నిర్మాణ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడ ఉన్న వృద్ధులను వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, పళ్ళు ఆహార పదార్థాలను అందజేశారు. ఇదేరోజు భవన నిర్మాణ దాత సందీప్‌రెడ్డి జన్మదినం కావడంతో పేదల మధ్య కేకును కట్‌చేసి తన జన్మదినాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డబ్బులు ఉన్నా దానంచేసే గుణం అందరికీ రాదని, వృద్ధాశ్రమంలోని పేదలకు వసతి కల్పించేందుకు నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. రామచంద్రరావు, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ హత్య కిరాతక చర్య
## సీపీఐ నారాయణ ధ్వజం



విలేకర్లతో మాట్లాడుతున్న కె.నారాయణ

చిత్తూరు జిల్లా వి.కోటలో జర్నలిస్ట్‌ను అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమైన చర్య అని సీపీఐ జాతీయ నాయకులు కె.నారాయణ అన్నారు. ఏప్రిల్ 29వ తేదీ గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాఫియాలను ప్రశ్నిస్తే హత్యలు చేయడం ఏమిటని, మనుషుల ప్రాణాలు తీసేయడం దుర్మార్గమన్నారు. ఎర్రచందనంపై వార్తలు ప్రచురిస్తే హత్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హత్య వెనుక ఉన్న మాఫియాను బయటపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్ట్‌ల రక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఇకనైనా అధికారులు నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, సీపీఐ నియోజకవర్గ సహాయక కార్యదర్శి షేక్ జమాలుల్లా, ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు



గూడూరు పట్టణంలోని వి.వి.ఎ, వి.హెచ్.ఎలతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖలతో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.గోపినాయక్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏ.డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయమే రాబోయే కాలానికి శరణమని వివరిస్తూ.. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు అడుగేసి తక్కువ ఖర్చుతో నిరంతరాదాయం చేకూర్చుకునేలా వారికి సహాయ సహకారాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఎన్.ఎఫ్.ఏ మధు ప్రకృతి వ్యవసాయంలోని 9 సార్వత్రిక సూత్రాలను ఏ విధంగా పాటించాలన్న విషయాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి వి.రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!




కావల్‌రెడ్డి రామకృష్ణారెడ్డి - శ్రీమతి జయమ్మ, బెల్లపు రామసుబ్బారెడ్డి - శ్రీమతి స్వర్ణలతల మనుమడు, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి - శ్రీమతి వేదవతిల కుమారుడు **మిత్ర వర్షిత్ - డా. శ్రియ సాత్విక** (కృష్ణ డెంటల్ క్లినిక్ అధినేత, ప్రముఖ దంతవైద్య నిపుణులు డా. వల్లపరెడ్డి కరుణాకరరెడ్డి - శ్రీమతి విజితల కుమార్తె)ల వివాహం ఏప్రిల్ 29వ తేదీ నెల్లూరులో వేడుకగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.




గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు, అలఘునాథస్వామి దేవస్థానం కమిటీ మెంబర్ కడివేడి రామమూర్తి - పద్మజల కుమార్తె **భవ్య - సురేష్‌బాబు** (విజయనగరం జిల్లా వాస్తవ్యులు కిల్లాడ తవిటి - చూడామణిల కుమారుడు)ల పరిణయం ఏప్రిల్ 21వ తేదీ విజయనగరంలో, రిసెప్షన్ 25వ తేదీ గూడూరులో వైభవంగా జరిగాయి. కొత్త జంటకి 'లాయర్' శుభాభినందనలు.

# జన గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## వేమిరెడ్డి దంపతుల పిలుపు


జనగణన పూర్తి చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనగణన-2027 (సెన్సస్-2027)లో భాగంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేశారు. ఇటీవల వారు నెల్లూరులోని తమ క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం డిజిటల్ విధానంలో జనగణన-2027 కార్యక్రమం చేపట్టిందని, ప్రజలందరు బాధ్యతాయుతంగా జనగణనలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వచ్చి ప్రజల వద్ద సమాచారం తీసుకుంటారని, ప్రజలందరూ వారికి సహకరించి వివరాలు తెలియజేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బషీర్, ఏఎస్‌వో రామ్మోహన్‌రావు, ఆర్ఐ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుకు అవార్డు హర్షదాయకం - విపిఆర్

ప్రముఖ మీడియా సంస్థ ఎకనామిక్ టైమ్స్ వారి ప్రతిష్టాత్మక అవార్డు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ -2025' ఈసారి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి లభించడం రాష్ట్రానికి గర్వకారణమని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'స్పీడ్ ఆఫ్ డెలివెరింగ్ గవర్నెన్స్' వంటి విప్లవాత్మక విధానాలను అమలుచేస్తూ... రాష్ట్రంలో పెట్టుబడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించారన్నారు. అతి తక్కువ కాలంలోనే రాష్ట్రానికి దాదాపు రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం గొప్ప విషయమన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏపీని గ్లోబల్‌హబ్‌గా మార్చేందుకు సీఎం చేస్తున్న కృషికి ఈ అవార్డు ఒక గొప్ప గౌరవం అని కొనియాడారు.

# విపిఆర్‌కు 'సాగరమిత్ర'ల ధన్యవాదాలు!



సాగర్ మిత్ర సమస్యలను కేంద్ర మంత్రి స్థాయిలో వివరించి మరో ఆరు నెలలు ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన సేవలను పొడిగించడంపై సాగరమిత్రలు హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృషిచేసిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని జిల్లాకి చెందిన సాగరమిత్రలు ఇటీవల నెల్లూరులోని విపిఆర్ కార్యాలయంలో కలిసి తమ ధన్యవాదాలు తెలిపి ఆత్మీయంగా సన్మానించారు. తక్కువ జీతానికి పనిచేసే తమ సమస్యను కేంద్రంలోని ప్రముఖుల వద్ద ప్రస్తావించి సాగరమిత్ర సేవలను పొడిగించేలా ఎంపీ విపిఆర్ కృషిచేయడం తమకెంతో సంతోషం కలిగిస్తోందన్నారు. ప్రధాన్‌మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని 2026 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు హర్షం ప్రకటిస్తూ, కేంద్రప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలిపారు. ఏపీ సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఆవుల వాసు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, సభ్యులు స్వప్న, లక్ష్మీ, మొబీన, మోహన్ పాల్గొన్నారు.

# జయభారత్ ఆసుపత్రికి..10 లక్షల విరాళం


డా. సి.వి.సుబ్రహ్మణ్యంకి విరాళం చెక్కుని అందజేస్తున్న దాతలు

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి పలువురు దాతలు ఏప్రిల్ 29న 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. బెంగళూరు వాస్తవ్యులు పొన్నలూరు సునీలరెడ్డి, సింహాద్రిరెడ్డి.. కీర్తిశేషులు దొడ్ల రంగారెడ్డి, దొడ్ల నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఆ విరాళమిచ్చారు. దాతల తరపున దొడ్ల కోదండరామిరెడ్డి జయభారత్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యంకు ఆ చెక్‌ను అందచేశారు. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ, తమ కుటుంబసభ్యులు జయభారత్‌కు అందజేసిన ఈ విరాళంతో వృద్ధుల కోసం ఒక వార్డ్ (పాలేటివ్ మెడికల్ కేర్ యూనిట్)ను ప్రారంభించాలని కోరారు. గతంలో కూడ జయభారత్‌లో కంటి విభాగనికి తమ కుటుంబ సభ్యులు సహకరించారని తెలిపారు. డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, దాతల కోరిక మేరకు ఆసుపత్రిలోని వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలందించడం కోసం కృషి జరుగుతోందని, సరైన వసతులతో వారికి గదులను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల్లూరులోని ఆసుపత్రుల్లో ఇలాంటి ఏర్పాటు ఇదే మొదటిదని తెలిపారు. అంతటి మంచి కార్యక్రమానికి దాతలు సహకరించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఓబులేష్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# మే నెలాఖరు వరకు.. ఉచిత వేసవి శిక్షణా శిబిరాలు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్‌కె జఫీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, షూటింగ్‌బాల్, సాఫ్ట్‌బాల్, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నిస్, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, యోగాసన క్రీడల్లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు.. వాటర్ కూలర్లు వితరణ


ఆర్టీసీకి వాటర్ కూలర్లని వితరణ చేస్తున్న దాతలు

నెల్లూరుజిల్లాలోని పలు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాల ద్వారా ప్రయాణించే ప్రయాణికులకు దాహార్తి తీర్చేందుకు వాటర్ కూలర్లను పిటిజి పెట్రోల్ బంకు గ్రూప్ అధినేత పిటి జగన్నాథం, ఎంజి బ్రదర్స్ సంస్థలు, పలువురు దాతలు వితరణగా ఇచ్చారు. బుధవారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పిటి జగన్నాథం మాట్లాడుతూ, ఏప్రిల్ నెల శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామచంద్ర జల ప్రసాదంగా ఈ వాటర్ కూలర్లను స్వీకరించాల్సిందిగా ఆర్టీసీ జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని కోరారు. అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు జోన్ వ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు వాణిజ్య ప్రముఖులు మంచినీటి ఆర్వో ప్లాంట్లను, ఎయిర్ కూలర్లను, ఫ్యాన్లను, వాటర్‌కూలర్ మిషన్లను తమ వితరణగా అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఆ దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

# విద్యార్థినులకి స్కాలర్‌షిప్‌లు

నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని 81 మంది విద్యార్థినులకు మలబార్ గోల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ వారు 6,96,000 రూపాయలను స్కాలర్‌షిప్ రూపంలో అందజేశారు. మలబార్ గోల్డ్ నెల్లూరు బ్రాంచ్ హెడ్ షాహిల్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అనేక కళాశాలలో విద్యార్థుల చదువుల కోసం 2.52 కోట్ల రూపాయలను స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తున్నామన్నారు. విద్యార్థినులు ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.యం రమణారెడ్డి మాట్లాడుతూ, అవకాశం ఉన్నట్లయితే విద్యార్థినుల వసతిగృహానికి సి.యస్.ఆర్ నిధులను వెచ్చించాలని వారిని కోరారు. విద్యాశాఖ అధికారులు బి.వి.కృష్ణారెడ్డి, టి.వరప్రసాదరావు, మలబార్ గోల్డ్ నెల్లూరు బ్రాంచ్ పిఆర్ఓ రాజేష్ పాల్గొన్నారు.

## స్ఫూర్తిదాయకం..
# వేంకటపార్వతీశ్వర కవుల రచనలు

డా. ఓలేటి పార్వతీశం



పార్వతీశంకి జ్ఞాపికను బహుకరిస్తున్న జె.కె.రెడ్డి, మధు

పద్యరచనలో ప్రసిద్ధిచెందిన వేంకట పార్వతీశ కవుల రచనలు అమోఘమని, పద్యకవులకు అవెంతో స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం(హైదరాబాద్) కొనియాడారు. చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస పరంపరలో భాగంగా ఆదివారం చెన్నై టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో జరిగిన సాహిత్యోపన్యాసంలో ఆయన పాల్గొని వేంకట పార్వతీశ్వర కవుల ప్రతిభా పాండిత్యాలను వివరించారు. తెలుగు పద్యానికి వన్నె వాసి తెచ్చిన వారిలో వేంకటపార్వతీశ్వర కవుల కృషి ఏనాటికీ మరువలేనిదన్నారు. వారి రచనలలోని మాధుర్యాన్ని, ప్రకృతి రమణీయతను ఈ సందర్భంగా ఆయన అద్భుతంగా విశదీకరించారు. 'భావ కవితా వైతాళికులు.. వేంకటపార్వతీశ్వర కవులు' అనే అంశంపై ఆయన ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం, వేదిక అధ్యక్షులు జెకె రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓలేటి వారిని శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. చెన్నైలోని తెలుగుభాషాభిమానులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దోర్నాల హరిబాబుకి..
# సుమన్ చేతులమీదుగా పురస్కారం



హరిబాబుకి పురస్కారం అందజేస్తున్న సినీ నటులు సుమన్

ఆలిండియా సుమన్ యువసేన అధ్యక్షులు రషీద్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు దోర్నాల హరిబాబును సినీనటుడు సుమన్ అభినందించి, సత్కరించారు. హాస్యనటుడిగా హరిబాబు పోషించిన విలక్షణ పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయన్నారు. కళారంగంలో హరిబాబు కృషిని గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. సుమన్ తల్లితండ్రులు కేసరి మరియు సుశీల్‌చందర్ జ్ఞాపకార్థం ఇచ్చే ఆ పురస్కారాన్ని దోర్నాల అందుకోవడం విశేషం. 25 కళాసంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి, ప్రముఖ చిత్రకారులు అమీర్‌జాన్, నటుడు కాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యారమ్స్‌లో ఉచిత శిక్షణ

క్యారమ్స్‌లో బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనం మహేష్‌రెడ్డి, కలవకూరు దయానందరెడ్డి తెలిపారు. నెల్లూరులోని మెక్లిన్స్ క్లబ్ రీడింగ్‌రూమ్‌లో జరిగే ఈ శిక్షణ ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఉంటుందని, క్యారమ్స్ జాతీయ క్రీడాకారుడు వి.రఘురామ్‌శ్రీధర్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 90147 74005 సంప్రదించాలని కోరారు.

# నవరస నటనా చక్రవర్తి.. నాగభూషణం

నాటక, సినీ రంగాన నాగభూషణం పేరు వింటేనే 'రక్త కన్నీరు నాగభూషణం' గుర్తుకొస్తారు. రక్త కన్నీరు నాటకంలో.. 'ఏంటి గోపాలం.. గోపాలం.. తపేలం లాగా.. మిస్టర్ పాల్.. అని పిలవమని చెప్పలా.. ఎస్ దట్స్ రైట్.. సుందరీ.. ఆర్ట్ ఉంటే నా హార్ట్ నిండిపోతుంది..' అంటూ తనదైన స్టైల్‌లో డైలాగులు చెప్పే నాగభూషణం నటన అమోఘం, అద్వితీయం. సినీ రంగంలో ఉన్నత స్థానంలోకి ఎదిగినా తనకు జీవితాన్ని ఇచ్చిన నాటక రంగాన్ని తుదిశ్వాస వరకు వదలని గొప్ప కళాకారుడు నాగభూషణం. వెండితెరపై దాదాపు 20 ఏళ్లు తన దైన శైలిలో విలన్‌పాత్ర పోషించిన విలక్షణ నట భూషణం.. నాగభూషణం.



కీర్తిమూర్తులు

### చిన్నతనం నుండే నాటకాలంటే ఆసక్తి

ఆయన పూర్తి పేరు చుండి నాగభూషణం. సీతమ్మ, రాఘవయ్య వీరి తల్లిదండ్రులు. వీరి జననం 1922 మార్చి 19. జన్మస్థలం ప్రకాశం జిల్లా (పాత నెల్లూరుజిల్లా) అనకర్లపూడి. పుట్టింది అమ్మమ్మగారి ఊరు అయినప్పటికీ పెరిగింది, చదివింది అంతా నెల్లూరులోనే. నాన్న రైస్‌మిల్లులో ఉద్యోగం చేసేవారు. నాగభూషణం హైస్కూల్ చదివే రోజుల నుంచే నాటకాలు వేసేవారు. నెల్లూరులో ఇంటర్మీడియట్ వరకు చదివారు. 1943 జనవరిలో రైల్వేలో నెలకు రూ.25 జీతంతో ఉద్యోగంలో చేరారు. 1951లో వృత్తిరీత్యా విజయవాడలో ఉండగా సినిమా వాళ్లు పిలిస్తే ఉద్యోగానికి రాజీనామా చేసి నెలకు రూ.250 జీతంతో సినిమా రంగంలోకి వెళ్లారు.

### అద్భుత నాటకంగా... రక్తకన్నీరు

తమిళంలో కథానాయకుడు ఎంఆర్ రాధా (కథానాయికలు రాధిక, నిరోషా వాళ్ల నాన్న) చేస్తున్న రత్త కన్నీర్ నాటకం ప్రజలకు బాగా నచ్చిందంతో దీనిని తెలుగులో చేయాలని నాగభూషణం ఆలోచించారు. దీంతో ఎంఆర్ రాధాను కలిసి ఆయన అనుమతి తీసుకున్నారు. భీమవరంలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా ఉన్న పాలగుమ్మి పద్మరాజు చేత స్క్రిప్ట్ రాయించి తెలుగులో రక్త కన్నీరు నాటకాన్ని మొట్టమొదటిసారిగా 1956 జులైలో నెల్లూరులో రెండు రోజులు ప్రదర్శించారు. ఈ నాటక ప్రదర్శన టికెట్లను బ్రతిమలాడి అమ్మినట్లు చెబుతారు నాగభూషణం. తన నట గురువుగా భావించే ఎస్వీ రంగారావు సలహా మేరకు తన డైలాగ్ మాడ్యులేషన్ మార్చుకున్నారు. నాటకంలోని ప్రతి డైలాగును కంఠస్థం చేసి, స్థానిక యాసతో నాటకాన్ని రక్తి కట్టించేవారు నాగభూషణం. నెల్లూరులో మొదలుపెట్టిన రక్త కన్నీరు నాటక ప్రదర్శన ఒక ఆంధ్రదేశంలోనే కాక దేశవ్యాప్తంగా 25 ఏళ్ల పాటు 5 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు నాగభూషణం. ఏడాదిలో వర్షాకాలం తప్ప మిగిలిన తొమ్మిది నెలలు నిర్విరామంగా ఈ నాటక ప్రదర్శన చేసేవారట. సినిమాల్లోకి వెళ్లినా ఖాళీ సమయాన్ని నాటక ప్రదర్శనకు కేటాయించేవారు. ఈ నాటకం ద్వారా నాటకంలోని ఇతర కళాకారులు, సాంకేతిక సిబ్బంది వంటి సుమారు 50 కుటుంబాలకు ఏళ్ల తరబడి ఉపాధి కల్పించారు నాగభూషణం. ప్రముఖ నటీమణులు వాణిశ్రీ, శారద మొదట్లో ఆయన నాటక బృంద సభ్యులే. రక్త కన్నీరు నాటకంలో నాగభూషణం గోపాల్ అనే జమీందారు బిడ్డగా సుందరి అనే ఆమె మోజులో పడి కుష్టు వ్యాధి బారిన పడతాడు. చివరకు భార్యను క్షమాభిక్ష కోరుతాడు. ఈ నాటకంలో ఆయన నటన అద్వితీయం.. 'న భూతో న భవిష్యతి!'.

### సినీ జీవితం :

పీపుల్ ఆర్ట్ థియేటర్స్ పతాకంపై 1952లో వచ్చిన 'పల్లెటూరు' సినిమా ఆయన తొలి చిత్రం. ఈ సినిమాలో ఆయన పోషించిన కొండయ్య పాత్ర చిన్నదే అయినా మంచి పాత్రే. పల్లెటూరు సినిమా కంటే ముందు ఆయన నటించిన రూపవతి, జ్యోతి, చిన్న కోడలు సినిమాలు వెండితెరపై రిలీజ్ అయ్యాయి. 1954లో విడుదలైన 'అమర సందేశం' సినిమాలో ఆయన విలన్ పాత్ర పోషించారు. 1956లో విడుదలైన పెంకి పెళ్ళాం చిత్రంలో తాగుబోతుగా అద్భుతంగా నటించారు. ఆయనకు హీరో కావాలన్న కాంక్ష కూడా మనసులో వుండేది. 1956లోనే ప్రతిభ పిక్చర్స్ ఘంటసాల కృష్ణమూర్తి నిర్మించిన 'ఏది నిజం' సినిమాతో ఎట్టకేలకు కథానాయకుడయ్యారు. ఆ సినిమాలో గుమ్మడి విలన్ పాత్ర పోషించారు. హీరోయిన్‌గా షావుకారు జానకి నటించారు. ఆ సినిమాకు రాష్ట్రపతి అవార్డు కూడా వచ్చింది. అనేక సినిమాల్లో ఎన్టీఆర్ హీరోగా, నాగభూషణం విలన్‌గా ప్రేక్షకులను రక్తి కట్టించారు. మంచి మనసున్న నాగభూషణం కష్టాల్లో ఉన్న కళాకారులకు చేతనైన సాయం చేస్తూ నిజ జీవితంలో గొప్ప కథానాయకుడుగా గుర్తింపు పొందారు. వెండితెరపై 350కు పైగా చిత్రాలలో నటించి చరిత్రలో నిలిచిపోయారు. జీవిత చరమాంకంలో హైదరాబాద్‌లో ఉంటూ 73ఏళ్ల వయసులో 1995 మే 5న కన్నుమూశారు.

(మే 5 నాగభూషణం వర్ధంతి)



చల్లా చంద్రశేఖర్‌రెడ్డి
సెల్. 94409 28666

## టూకీగా...



### విడవలూరు గ్రంథాలయంలో.. వేసవి విజ్ఞాన శిబిరం

మండల కేంద్రమైన విడవలూరులోని గ్రంథాలయంలో ఏప్రిల్ 28న వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. విద్యార్థులు మొబైల్‌ఫోన్‌కి దూరంగా ఉంటూ, మంచి పుస్తకాలు చదువుకోవాలని గ్రంథాలయ నిర్వాహకురాలు నిరూప తెలిపారు. సృజనాత్మక కార్యక్రమాలపై విద్యార్థులు దృష్టిపెట్టి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె వారికి వివరించారు.

### కొడవలూరులో జనగణనపై సమావేశం

మండల కేంద్రమైన కొడవలూరులో ఏప్రిల్ 28న జనగణనపై సూపర్‌వైజర్లకు తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి తగు సూచనలిచ్చారు. ప్రతి ఇంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. జనగణన ఎంతో ముఖ్యమైన కార్యక్రమని, ఎవరూ ఎలాంటి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయకుండా ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆమె చెప్పారు.

### పడుగుపాడులో చలివేంద్రం ప్రారంభం

కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటైన మజ్జిగ చలివేంద్రంను ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి ఏప్రిల్ 28న ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, అన్ని పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. పంచాయతి ఇన్‌చార్జి కార్యదర్శి సలీమ్ పాల్గొన్నారు.

### చెర్లోయడవల్లిలో ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లిలో ఇటీవల డాక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 125 మంది రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో అల్లంపాటి రాజేష్, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లెక్కలవారిపాలెంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

వింజమూరు పంచాయతీలోని లెక్కలవారిపాలెంలో ఏప్రిల్ 28న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి వ్యవసాయ శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కన్నయ్య, వ్యవసాయాధికారి ఏ. వాసు, ఉద్యానశాఖాధికారి సాహిల్, ఏఇఓ మనోహర్ పాల్గొని ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను, పంటల సాగులో మెళకువలను వారికి వివరించారు.

### వరిగొండ జ్వాలాముఖి అమ్మవారికి పొంగళ్ళు

తోటపల్లిగూడూరు మండలం వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో గ్రామస్తులు ఆదివారం పొంగళ్ల మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్‌పర్సన్ కోడూరు రాజేశ్వరి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. గ్రామస్తులు పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు.

### ఉదయగిరిలో మలేరియాపై ర్యాలీ

ఉదయగిరిలో ఇటీవల మలేరియా వ్యాధిపై ఉదయగిరి సబ్‌యూనిట్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ శివకల్పనారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఆరోగ్యాధికారులు పాల్గొని ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. సీహెచ్ఓ శివకుమారి, వెంకటేశ్వర్లు, అంకమ్మ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### జంగంవారిదొరువులో ఉచిత పశువైద్య శిబిరం

ఇందుకూరుపేట మండలంలోని జంగంవారిదొరువులో ఇటీవల తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందుకూరుపేట పశుసంవర్ధకశాఖ ఏ.డి డాక్టర్ వసంతరాయులు పర్యవేక్షించారు. ప్రొఫెసర్లు మధుసూదనరెడ్డి, ఎం.ప్రదీప్, ఎన్.వాణి పాల్గొని పశువుల ఆరోగ్యంపట్ల జాగ్రత్తలను వివరించారు.

### ఆత్మకూరులో ఎరువుల దుకాణాలు తనిఖీ

ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, వ్యవసాయాధికారులు బి.శ్రీదేవి, హరికరుణాకర్‌రెడ్డి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఎంఆర్‌పీ ధరలకంటే ఎక్కువ ధరలకి ఎరువులను అమ్మితే చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు.

# మే 1 నుంచి..వెంకయ్య జిల్లా పర్యటన



భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. మే 1వ తేదీ నుండి 3వతేదీ వరకు ఆయన జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మే 1వతేదీ ఉదయం 9.15 గంటలకు వెంకటాచలం మండలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌కు ఆయన చేరుకుంటారు. సాయంత్రం 6.40 గంటలకు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, రాత్రి 7.00 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్ కన్వెన్షన్‌కు వచ్చి, 7.15 గంటలకు వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం రాత్రి 8.20 గంటలకు తిరిగి స్వర్ణ భారత్ ట్రస్ట్‌కి చేరుకుని అక్కడే బస చేస్తారన్నారు. మే 2వ తేది ఉదయం 8 గంటలకు వెంకయ్యనాయుడు స్వర్ణ భారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి, 8.20 గంటలకు గొలగమూడిలోని శ్రీ వెంకయ్య స్వామి దేవాలయానికి చేరుకుంటారు. 8.30 గంటలకు వెంకయ్య స్వామి 'గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు అక్కడి నుండి బయలుదేరి, ఉదయం 9.50 గంటలకు తిరిగి స్వర్ణ భారత్ ట్రస్ట్‌కి చేరుకుంటారు. మే 3వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుండి బయలుదేరి 7 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుండి హైదరాబాద్‌కి వెళ్తారు.

## 5 రాష్ట్రాల ఫలితాలపై..

# సర్వత్రా ఉత్కంఠ!

- **అందరి దృష్టి మే4 పైనే!**

గట్టిగా మరో మూడురోజుల వ్యవధిలోనే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరితో పాటు 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓటమి పాలవుతారోననే ఉత్కంఠ పెరిగిపోతోంది. పోలింగ్‌శాతం గణనీయంగా పెరగడం దేనికి సంకేతమన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. పోలింగ్ పెరిగిందంటే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని విశ్లేషకుల భావన. మార్పు కోరుకునే విధంగానే తీర్పు ఉంటుందని, ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం తప్పదని కూడా అనుకుంటున్నారు.

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి బెంగాల్‌లో అత్యధికంగా 92.47శాతం పోలింగ్ జరగడం పెద్ద సంచలనం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బెంగాల్, తమిళనాడుల్లో ఇంత భారీఎత్తున పోలింగ్‌శాతం పెరగడం ఇదేనని అంటున్నారు. తమిళనాడులో పోలింగ్ 85.14 శాతానికి పెరిగింది. అస్సాంలో 85.38 శాతం, పుదుచ్చేరిలో 89.83 శాతం పోలింగ్ జరిగింది. ఇవన్నీ సరికొత్త రికార్డే. అందులోనూ మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం విశేషం. దీంతో విజయాలు ఎటువైపు మళ్లుతాయో ఎవరికీ అర్థం కావడం లేదు. కేరళలో కూడా ఈసారి మార్పు జరగవచ్చని, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి గెలిచే అవకాశం లేకపోలేదని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇక్కడ యూడీఎఫ్, అధికార ఎల్డీఎఫ్ కూటమిల మధ్య పోరు పోటాపోటీగా ఉంది. ఎవరు గెలుస్తారో వేచి చూడాల్సి ఉంది. బీజేపీ ఇక్కడ ఈసారి కొన్ని స్థానాలు మెరుగుపరచుకోవచ్చని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు.

### బెంగాల్ బెబ్బులి ఎవరో!..

పశ్చిమ బెంగాల్‌లో గత పదిహేనేళ్ళుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు మమతా బెనర్జీ ఈసారి గెలుస్తారా..లేదా అన్నది దేశంలో పెద్ద చర్చనీయాంశంగా ఉంది. ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం..మోడీ మాటలు వినేందుకు వచ్చిన జనసందోహాన్ని చూశాక, అనేకమందిలో ఈసారి బీజేపీయే గెలుస్తుందనే మాట సర్వత్రా వినిపిస్తోంది. మమతమ్మ ముందు కమ్యూనిస్టులకు కూడా బెంగాల్ కంచుకోటగా ఉండేది. ఇప్పుడా రోజులన్నీ పోయాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే గతంలో కంటే కూడా రికార్డుస్థాయిలో ఎవరూ ఊహించని విధంగా బెంగాల్‌లో పోలింగ్ శాతం బాగా పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. ఆ లెక్కన చూస్తే ఈసారి బెంగాల్ బెబ్బులి బీజేపీయే అవుతుందని కూడా వారు ఊహిస్తున్నారు. బెంగాల్‌లో బీజేపీ గెలవడం ఖాయమని ప్రధాని మోడీ చెప్తుంటే, ఎవరెన్ని చెప్పినా గెలిచేది మేమేనంటోంది తృణమూల్ కాంగ్రెస్. 'మూడుసార్లు గెలిచాం.. నాలుగోసారీ మేమే వస్తాం.. ఎవరెన్ననుకున్నా విజయం మాదేనని' మమతాబెనర్జీ ధీమాగా ఉన్నారు.

### తమిళనాడులో విజయం ఎవరికో!

తమిళనాడు అంటేనే డీఎంకే, అన్నాడీఎంకే. ఈ రెండు పార్టీలతోనే తమిళనాడు రాజకీయాలన్నీ ముడిపడి ఉన్నాయి. కొత్తగా సినీస్టార్ విజయ్ సారథ్యంలో టీవీకే పార్టీ రావడంతో పోటీలో ఉత్కంఠ పెరిగింది. డీఎంకే స్టాలిన్, అన్నాడీఎంకె పళనిస్వామిలతోపాటు ఈసారి జనహోరుతో రంగంలోకి దిగిన టీవీకే విజయ్ ప్రచారాలతో తమిళనాడు అట్టుడికిపోయింది. తమిళనాడులో ఏ సభకైనా జనానికి లోటుండదు. అయితే వారి గుండెల్లో ఎవరికి చోటుందో మాత్రం చివరిదాకా ఎవరికీ తెలియదు. ఓటింగ్‌శాతం కూడా ఈసారి 85.14 శాతానికి పెరిగింది. విజయ్ గెలుస్తాడని కొందరంటే, స్టాలిన్‌కి తిరుగులేదని మరికొందరంటున్నారు. మధ్యలో పళనిస్వామికి ఛాన్స్ లేకపోలేదని కూడా మరికొందరంటున్నారు.

ఈ అయిదుచోట్లా నేతల ప్రచారహోరు, ఓటింగ్ తీరు చూస్తే..ఈసారి లెక్కలు మారేట్లు కనిపిస్తున్నాయి. ఏదేమైనా, మే 4న వచ్చే ఫలితాల్లో ఎవరు విజేతలెవరన్నది అమీతుమీ తేలిపోనుంది. ప్రధాని వద్ద నుంచి పెద్దపెద్ద నాయకులంతా రంగంలోకి దిగి చేసిన ప్రచారాల ఫలితాలు ఎలా ఉంటయో మే4వ తేదీ తేలిపోనుంది!

# సాంకేతికతతో..వైద్యరంగంలో అద్భుతాలు!

- వందల కిలోమీటర్ల దూరం నుంచి అందుబాటులోకి స్పెషలిస్టుల సేవలు
- దేశంలోనే తొలి టెలి-రోబోటిక్ సర్జరీ చేసిన నారాయణ-జీఎస్ఎల్ ఆస్పత్రులు
- అభినందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు




టెలి-రోబోటిక్ సర్జరీ పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు, నారాయణ విద్యాసంస్థల ఛైర్మన్ పునీత్, డైరెక్టర్లు సింధూర, శరణి తదితరులు

వైద్యరంగంలో సాంకేతికత అద్భుతాలు సృష్టిస్తోంది. రోగులు ఎంత దూరంలో ఉన్నా సరే, స్పెషలిస్టులు వారికి రోబోటిక్ సర్జరీలను అత్యంత సమర్థవంతంగా, విజయవంతంగా చేసే వెసులుబాటు కలగడం వైద్యసేవారంగానికి ఎంతో ఉపయోగకరం. అలాంటి సాంకేతిక నైపుణ్యాలను సమర్థంగా వినియోగిస్తే వైద్య సేవలను ప్రజలకు మరింత సులభతరం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ప్రశంసించారు. ఏప్రిల్ 27న అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో నారాయణ మెడికల్ కాలేజీ–ఆస్పత్రులు, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ–ఆస్పత్రుల యజమాన్యాలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. ఇటీవల తమ రెండు ఆస్పత్రులు కలిసి టెలి–రోబోటిక్ సర్జరీ నిర్వహించినట్టు సీఎం దృష్టికి తెచ్చారు. టెలి–రోబోటిక్ సర్జరీ జరిగిన తీరును ఆయా మెడికల్ సంస్థల యాజమాన్యాలకు చెందిన ప్రతినిధులు సింధూర, గన్ని భాస్కరరావు సీఎంకు వివరించారు. నెల్లూరులోని నారాయణ హాస్పిటల్‌లో ఉన్న రోగికి రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులు రోబో ద్వారా సర్జరీ చేశారని, అలాగే జీఎస్ఎల్‌లో ఉన్న రోగికి నారాయణ ఆస్పత్రి వైద్యులు దూరం నుంచే శస్త్ర చికిత్స నిర్వహించారని వివరించారు. దేశంలోనే తొలిసారి ఈ తరహా సర్జరీ నిర్వహించినట్టు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా రెండు ఆస్పత్రుల యజమాన్యాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర నారాయణ మాట్లాడుతూ, ఇలాంటి సర్జరీల ద్వారా మనదేశంలో ఎప్పుడూ జరగని అద్భుతాన్ని సృష్టించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మెడికల్ టూరిజంలో నెంబర్‌వన్‌గా మార్చేందుకు తాము కృషి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో నారాయణ విద్యాసంస్థల చైర్మన్ పునీత్, డైరెక్టర్లు సింధూర, శరణి, రవితేజ ఉన్నారు.

# 89.47 శాతం ఉత్తీర్ణతతో.. టెన్త్‌లో బాలికలే ఫస్ట్

- **నెల్లూరుకి 13వ స్థానం**

ఇంటర్‌లోనే కాదు, 10వ తరగతి ఉత్తీర్ణతల్లోనూ బాలికలే ముందంజ వేశారు. ఏప్రిల్ 30 గురువారం నాడు విడుదలైన టెన్త్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరు జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, అందులో 87.90 శాతం మంది బాలికలు, 82.68 శాతం మంది బాలురు పాసయ్యారు. 96.07 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమస్థానం సాధించగా, 57.12 శాతంతో అల్లూరిజిల్లా చివరిస్థానంలో నిలిచింది. నెల్లూరుజిల్లాలో బాలుర ఉత్తీర్ణత శాతం 85.26 కాగా, బాలికలు 89.47 శాతం ఉత్తీర్ణత సాధించి తామే ఫస్ట్ అనిపించుకున్నారు. మొత్తం జిల్లాలో 13789 మంది బాలురు పరీక్షలకు హాజరైతే, అందులో 11,757 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 13,908 మంది హాజరై, 12,443 మంది ఉత్తీర్ణత సాధించారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com